ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
శుక్రవారం 10 జనవరి 2025 | 3





సూర్యాస్తమయ సౌందర్యం


సామర్లకోట రోడ్డులో..
ఫొటో : స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కాకినాడ



ముస్తాబైన వాడపల్లి వెంకన్న ఆలయం

నేడు ఉత్తర ద్వార దర్శనం

ముక్కోటి ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని శుక్రవారం స్వామి, అమ్మవార్లు ఉత్తరద్వారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. అన్నవరంలో సత్యదేవుడిని శ్రీమహా విష్ణువుగా, అమ్మవారిని లక్ష్మీదేవిగా అలంకరించి ఉత్తర ద్వారాన దర్శనం ఇవ్వనున్నారు. ఇందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. అలాగే వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయంలోనూ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని ఫలపుష్పాలతో అలంకరించారు. అలాగే జిల్లాలోని అన్ని వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. 4

అన్నవరంలో ముస్తాబైన వైకుంఠ ద్వారం

పండగ బాదుడే..



(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

సంక్రాంతి సమీపించడంతో టిక్కెట్ ధరలు షాక్ కొడుతున్నాయి. సామాన్యుడికి అందకుండా ఆకాశాన్నంటుతున్నాయి. పండగకు ఇంటికి రావాలనుకునేవారి జేబులకు చిల్లులు పడుతున్నాయి. సంక్రాంతి పండగ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాకు అధికంగా హైదరాబాద్ నుంచి వస్తారు. ప్రైవేటు ట్రావెల్స్ రెట్టింపు ధరలు పిండేస్తుండగా రైళ్లలో ఒక్క సీటు లేని పరిస్థితి. పోనీ విమానంలో వద్దామనుకుంటే అవి కూడా ఫుల్ అయిపోయాయి. డిమాండ్ పెరగడంతో ఇండిగో కంపెనీ చార్జీలను భారీగా పెంచేసింది. పండగ రద్దీ పేరుతో సాధారణ రోజుల్లో ఉండే విమాన చార్జీ ధర రూ.3,299 కాస్తా ఇప్పుడు ఏకంగా రూ.15,850కి పెరిగిపోయింది.ప్రధానంగా హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరం విమానాశ్రయానికి ఇండిగో రోజుకు ఆరు సర్వీసులు నడుపుతోంది. శుక్రవారం నాటికి ఐదు విమానాల్లో సీట్లన్నీ నిండిపోగా, ఒకే ఒక విమానంలో అరకొరగా సీట్లున్నాయి. అయితే వీటి చార్జీ ధర ఏకంగా రూ.15,086గా ఉంది. ఒకరకంగా ఐదు రేట్లు పెరిగిపోయి చార్జీలు షాక్ కొడుతున్నాయి. శనివారం అయితే నాలుగు విమానాల్లో సీట్లన్నీ నిండిపోగా రెండింటిలో మాత్రమే కొద్దిగా సీట్లున్నాయి. అయితే చార్జీలు రూ.14,486 చొప్పున కంపెనీ వసూలు చేస్తోంది. ఈనెల 12న అయితే టికెట్ ధరలు రూ.15,850 చొప్పున ఇండిగో వసూలు చేస్తోంది. 13న అంటే భోగి రోజున కాస్త డిమాండ్ తక్కువగా ఉండడంతో రూ.11,650 వరకు చార్జీలు ఉన్నాయి. సంక్రాంతి రద్దీ నేపథ్యంలో రైల్వేశాఖ హైదరాబాద్ నుంచి కాకినాడకు రోజుకు మూడు ప్రత్యేక రైళ్లను అదనంగా నడుపుతోంది. వీటిలోనూ సీట్లన్నీ నిండిపోయి వెయిటింగ్ లిస్ట్ 290 వరకు ఉంది. మరికొన్నింటిలో ఏకంగా రిగ్రేట్ చూపుతోంది. వీటిలో సీట్ల లభ్యత ఈనెల 14 నుంచి మాత్రమే ఉన్నాయి. పండగ తర్వాత తిరిగి హైదరాబాద్ ప్రయాణం అయ్యేవారికి ఇప్పటినుంచే విమాన చార్జీలు షాక్ కొడుతున్నాయి. ఈనెల 15న రాజమహేంద్రవరం నుంచి హైదరాబాద్‌కు ఇండిగో విమాన చార్జీ సమయం బట్టి రూ.10,384 నుంచి రూ.14,887 వరకు ఎగబాకాయి. 16న ఏకంగా రూ.16,394 వరకు చార్జీలు పెరిగాయి. ఒకరకంగా చెప్పాలంటే ఈనెల 19 వరకు తిరుగు ప్రయాణానికి సంబంధించి బాదుడే బాదుడు అన్నట్టు కొనసాగుతోంది.

రోజుకు రూ.1.65 కోట్ల దోపిడీ

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల పరిధిలో కాకినాడ నుంచి 40 ప్రైవేట్ బస్సులు, అమలాపురం రాజోలు నుంచి 50 ప్రైవేట్ బస్సులు, రాజమహేంద్రవరం నుంచి 60 ప్రైవేట్ బస్సులు వెరసి 150 ప్రైవేట్ బస్సులు హైదరాబాద్, బెంగుళూరు పట్టణాలకు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. ఒక్కొక్క బస్సులోనూ సుమారు 50 నుంచి 55 మంది 8,250 మంది చొప్పున ప్రయాణిస్తుంటారు. పండుగ పేరిట స్పెషల్ ధరలతో ప్రయాణికుల నుంచి ప్రైవేట్ బస్సుల ఆపరేటర్లు సుమారు రూ. 1.65 కోట్ల మేర ప్రతి రోజూ అదనపు వసూళ్లు చేస్తూ దారుణ దోపిడీకి గురిచేస్తున్నారు. అయినా ప్రభుత్వం కళ్లు తెరవకపోవడం గమనార్హం.

పెద్ద పండుగకు వద్దామంటే.. ప్రైవేటు దోపిడీ

- రైళ్లన్నీ రిగ్రేట్.. బస్సులన్నీ ఫుల్
- పండుగంతా ప్రైవేట్ స్పెషల్‌దే
- బస్సు టిక్కెట్ల ధరకు రెక్కలు
- రెట్టింపు ధరల వసూళ్లు
- సీటు అయితే రూ.2 వేలు
- బెర్త్ రూ.3 వేలు
- రద్దీ పేరిట భారీ వసూళ్లు
- ఆకాశంలో విమాన చార్జీలు
- మూడు రెట్లు పెరిగిన వైనం
- ఆర్టీసీ బస్సులకు భారీ డిమాండ్

ఆర్టీసీ ఏం చేస్తుందో..

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సంక్రాంతి బస్సు సర్వీసులకు విపరీతమైన డిమాండ్ నెలకొంది. ప్రధానంగా హైదరాబాద్, సికింద్రాబాద్ నుంచి జిల్లాకు వచ్చే ప్రజల నుంచి ఈ డిమాండ్ ఎక్కువగా వినబడుతోంది. ఇప్పటికే జిల్లా ఆర్టీసీ ప్రీ-సంక్రాంతి ఆపరేషన్‌లో భాగంగా రాజమహేంద్రవరం, కొవ్వూరు, నిడదవోలు, గోకవరం డిపోల నుంచి 88 స్పెషల్ సర్వీసులు నడిపేందుకు ఏర్పాట్లు చేసింది. అయితే ఈ స్పెషల్ సర్వీసుల్లో టిక్కెట్లన్నీ గతంలోనే హాట్‌కేకుల్లా అమ్ముడుపోయాయి. వీటితోపాటు షెడ్యూల్ సర్వీసుల్లోనూ టిక్కెట్లు లేవు. దీంతో హైదరాబాద్ నుంచి మరిన్ని బస్సులు నడపాలనే డిమాండ్ వస్తున్నట్టు ఆర్టీసీ వర్గాలు చెబుతున్నాయి. ప్రధానంగా హైదరాబాద్, చుట్టుపక్కల స్థిరపడిన వారు పెద్ద పండక్కి సొంతూర్లకు తరలివస్తారు. ఆర్టీసీ సర్వీసుల్లో సాధారణ బస్సు చార్జీలను మాత్రమే వసూలు చేస్తుండడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. జిల్లా ఆర్టీసీ మాత్రం హైదరాబాద్ నుంచి జిల్లాకు మరిన్ని స్పెషల్ సర్వీసులు నడిపేందుకు మీనమేషాలు లెక్కిస్తున్నట్టు కనబడుతోంది. డిమాండ్‌కు అనుగుణంగా మరిన్ని స్పెషల్ సర్వీసులు నడపడం ద్వారా భారీగా ఆదాయం పొందే అవకాశం ఉన్నా ఆర్టీసీ తూర్పుగోదావరి జిల్లా అధికారులు ఇప్పటివరకూ అదనపు స్పెషల్స్‌పై ఎలాంటి ప్రకటనా చేయలేదు.

పండుగ పూట.. ప్రైవేట!

సామర్లకోట, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మరో మూడు రోజుల్లో సంక్రాంతి. రైళ్లన్నీ ఫుల్ కావడంతో హైదరాబాద్, బెంగళూరు, మైసూర్, చెన్నై ప్రాంతాల నుంచి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని సామర్లకోట, కాకినాడ, రంగంపేట, రాజమహేంద్రవరం, ద్వారపూడి, అనపర్తి, అటు కోనసీమ ప్రాంతాలకు వచ్చేందుకు ప్రైవేట్ ఏజన్సీల వద్దకు జనం పరుగులు తీస్తున్నారు. దీంతో ప్రైవేట్ ఆపరేటర్లు టిక్కెట్ల ధరలను అమాంతం పెంచేశారు. ఆన్‌లైన్‌లో భారీ ధరలకు టిక్కెట్ల విక్రయాలకు పోటీపడుతున్నారు. సంక్రాంతి పండుగను సొంతూళ్లో జరుపుకోవడం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వాసుల కల. దీనిని ప్రైవేట్ బస్సుల నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నారు. రైళ్లు ఫుల్ కావడంతో ప్రయాణికులకు ఏకైక ప్రత్యామ్నాయ మార్గంగా ఉన్న ప్రైవేట్ బస్సుల టిక్కెట్ల ధరలను పెంచేశారు. సాధారణ రోజుల్లో హైదరాబాద్ నుంచి సామర్లకోట మీదుగా కాకినాడకు రూ.890-900 మధ్య టిక్కెట్ ధరలను వసూలు చేస్తారు. బెంగుళూరు నుంచి రూ.1,500 నుంచి రూ.1,800 మధ్య వసూలు చేస్తారు. ప్రస్తుత ధరలు చూస్తే కళ్లు బైర్లు కమ్మేలా ఉన్నాయి. ఆన్‌లైన్‌లో హైదరాబాద్ నుంచి సామర్లకోటకు సీటు ఒక్కింటికి రూ.1,880 వసూలు చేస్తున్నారు. ఇదే బెర్తులైతే రూ.2300-2600 చొప్పున వసూలు చేస్తున్నారు. చెన్నై, ముంబై వంటి ప్రాంతాల నుంచి టిక్కెట్ల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. అప్పర్, లోయర్ బెర్త్ అంటూ వేరు చేసి డిమాండ్‌ను బట్టి రూ.1,880 నుంచి రూ.3 వేల వరకూ ప్రైవేటు ట్రావెల్స్ యజమానులు పిండేస్తున్నారు.

నేటి నుంచి ప్రైవేటు బస్సుల తనిఖీలు : డీటీవో

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి9 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగకు స్వస్థలాలకు వచ్చే ప్రయాణికుల నుంచి అధిక చార్జీలను వసూలు చేసినా, ప్రయాణ సమయంలో ప్రయాణికులకు అసౌకర్యం కలిగించినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తూర్పుగోదావరి జిల్లా రవాణా అధికారి ఆర్.సురేష్ హెచ్చరించారు. వాహనాలకు సరైన రికార్డులు లేకపోయినా, నిబంధనలకు విరుద్ధంగా బస్సులు తిరుగుతున్నా జప్తు చేస్తామని స్పష్టంచేశారు. రాజమహేంద్రవరం డీటీవో కార్యాలయంలో గురువారం జిల్లాలోని ప్రైవేట్ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు యజమానులు, ప్రైవేట్ ట్రావెల్స్ ఏజెంట్ల యజమానులతో సమావేశం నిర్వహించారు. పండుగ సందర్భంగా తనిఖీలకు రవాణా అధికారులతో కూడిన స్పెషల్ టీంలను ఏర్పాటుచేశామన్నారు. ఈనెల 10వ తేదీ నుంచి 20వ తేదీ వరకూ తనిఖీలు నిర్వహిస్తామన్నారు. బస్సుల్లో ప్రయాణికుల లగేజీ బ్యాగులు మాత్రమే ఉండాలని, వాణిజ్యపరమైన వస్తువులను తరలించకూడదన్నారు. ప్రయాణికులు సురక్షితంగా తీసుకురావాలని కోరారు.

తెలుగు వెలగాలి

ముగిసిన తెలుగు మహాసభలు




రాజమహేంద్రవరంలో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల్లో ఎంపీ పురందేశ్వరి, మంత్రి దుర్గేష్‌లకు సన్మానం చేస్తున్న జీజీయూ కులపతి చైతన్య రాజు, కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, మాడుగుల నాగఫణిశర్మ, టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు దంపతులు

తెలుగు వెలగాలి.. తెలుగును బతికించుకుందాం.. తెలుగును కాపాడుకుందాం.. తెలుగు భాషా పరిరక్షణకు పాటుపడదాం.. ఇంగ్లీషు వద్దు.. తెలుగేరా ముద్దు.. ప్రతి ఒక్కరి నోటా ఇదే మాట.. అందుకు ఏమైనా చేస్తామని.. ఎటువంటి సహాయం కావాలన్నా అందిస్తామని నాయకులు ప్రతినబూనారు.. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం జీజీయూలో చివరి రోజు గురువారం ప్రపంచ తెలుగు మహాసభ అట్టహాసంగా సాగింది. దీనిలో భాగంగా పలువురు ప్రముఖులు తెలుగు వీర లేవరా.. దీక్ష బూని సాగరా అంటూ పిలుపునిచ్చారు.. తెలుగు ప్రాముఖ్యత నలుదిశలా వినిపించేలా చాటారు. 'తల్లిదండ్రుల్లో మార్పురావాలని.. తమ పిల్లలను తెలుగులోనే చదివించాలని .. కూటమి ప్రభుత్వం తెలుగు భాషా పరిరక్షణకు పాటుపడుతుందని' కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు.. 'సీఎం చంద్రబాబు ఇప్పటికే ప్రభుత్వ ఉత్తర్వులు తెలుగులో ఉండాలని ఆదేశాలు జారీ చేశారని, కింద స్థాయి నుంచి తెలుగు మాధ్యమం ప్రవేశపెట్టడం కోసం త్వరలో ప్రభుత్వం నిర్ణయం ప్రకటిస్తుందని' మంత్రి కందుల దుర్గేష్ స్పష్టంచేశారు. 'మధురమైన, అద్భుత భాష తెలుగును భావితరాలకు అందించాలని.. ప్రపంచంలో ప్రజలు మాట్లాడే భాషల్లో తెలుగు 15వ స్థానంలో ఉండగా, మన దేశంలోని భాషల్లో తెలుగుకు నాల్గవ స్థానం ఉందని' బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి అన్నారు.. జీయూ చైర్మన్ చైతన్యరాజు మాట్లాడుతూ ప్రతి ఏడాది తెలుగు సంక్రాంతి పండుగను నిర్వహిస్తానన్నారు. కాగా తెలుగు మహాసభల్లో భాగంగా అచ్చతెలుగులో చిన్నారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అబ్బురపరిచాయి.. 4


తెలుగు వీర లేవరా.. దీక్ష బూని సాగరా.. అంటూ చిన్నారి ప్రదర్శన..


సమావేశంలో మాట్లాడుతున్న మల్లిబాబు

కోడి పందాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి

కాకినాడ ఆర్డీవో మల్లిబాబు

కలెక్టరేట్(కాకినాడ), జనవరి9(ఆంధ్రజ్యోతి):సంప్రదాయ పండగల నేపథ్యంలో కోడిపందాలు, జూద క్రీడల నిషేధం అమలుకు సంబంధించి ముందస్తు చర్యల నిమిత్తం డివిజనల్ స్థాయి సమన్వయ సమావేశం కాకినాడ ఆర్డీవో మల్లిబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాల మేరకు రాబోయే సంక్రాంతి పండుగ సీజన్‌లో కోడిపందాల నిషేధాన్ని సమర్థవంతంగా అమలుచేయడానికి మండల స్థాయిలో సంయుక్త తనిఖీ బృందాల ఏర్పాటు చేయాలని, గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించాలన్నారు. పోలీసు, రెవెన్యూ, ఇతర శాఖల సమన్వయంతో పనిచేసి కోడి పందాలు, ఇతర జూద క్రీడలు, అసాంఘిక చట్టవ్యతిరేక కార్యకలాపాలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో సంక్రాంతి పండుగను నిర్వహించుకునేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రఘువీర్‌విష్ణు, కాకినాడ డివిజన్‌లోని తహసీల్దార్లు, సబ్‌ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

పవన్ పర్యటనకు రెడీ!

- నేడు కుమారపురంలో మినీ గోకులం ప్రారంభం
- పిఠాపురంలో సంక్రాంతి సంబరాలు, బహిరంగసభ
- డిప్యూటీ సీఎం పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్, ఎస్పీ, ఎంపీ సమీక్ష


పిఠాపురంలో పవన్ పాల్గొనే సభలో వేదిక

పిఠాపురం, జనవరి9(ఆంధ్రజ్యోతి):పిఠాపురం నియోజకవర్గంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ శుక్రవారం జరిపే పర్యటనకు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆయన పర్యటించే ప్రాంతాల్లో ఎక్కడికక్కడ బారికేడ్లు ఏర్పాటుచేయడంతోపాటు కార్యక్రమాలకు వచ్చే నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు ఏ ఇబ్బందీ లేకుండా చర్యలు చేపట్టారు. పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, సంక్రాంతి సంబరాల్లో పాలుపంచుకుని బహిరంగసభలో పాల్గొనేందుకు శుక్రవారం పవన్‌కల్యాణ్ తన నియోజకవర్గమయిన పిఠాపురం రానున్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. రాజమహేంద్రవరం విమానాశ్రయం నుంచి ఏడీబీ రోడ్డు మీదుగా పిఠాపురం మండలం కుమారపురం చేరుకుని అక్కడ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన యాతం నాగేశ్వరరావుకు చెందిన మినీ గోకులాన్ని ప్రారంభిస్తారు. అనంతరం అక్కడ రైతులతో మాట్లాడే అవకాశం ఉంది. అక్కడ నుంచి పిఠాపురం పట్టణంలోని పాతబస్టాండు మునిసిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన కార్యక్రమాల వద్దకు చేరుకుంటారు. ఇక్కడ జరిగే సంక్రాంతి సంబరాల్లో పాల్గొని వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసే స్టాల్స్ పరిశీలిస్తారు. బహిరంగసభా వేదికపై నుంచే పిఠాపురం నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను వర్చువల్ విధానంలో ప్రారంభించడంతోపాటు ఇతర కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ఇక్కడ నుంచే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 12,500 మినీ గోకులాలను ఇక్కడ నుంచే ప్రారంభిస్తారు. పవన్ పాల్గొనే కార్యక్రమాల ఏర్పాట్లను కలెక్టర్ సగిలి షాన్‌మోహన్, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయశ్రీనివాస్, ఎస్పీ విక్రాంత్ పాటిల్ తదితరులు పరిశీలించారు. వారి వెంట జేసీ రాహుల్‌మీనా, ట్రైనీ కలెక్టర్ భావన, పిఠాపురం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు ఉన్నారు.


ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్, ఎంపీ

పర్యటన సాగేది ఇలా..

రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ శుక్రవారం ఉదయం 7.45కు మంగళగిరి క్యాంప్ కార్యాలయం నుంచి బయలుదేరి గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి 8.30 గంటలకు ప్రత్యేక విమానంలో బయలుదేరి 9.10 గంటలకు రాజమహేంద్రవరం విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి రాజానగరం, రంగంపేట, పెద్దాపురం, సామర్లకోట ఏడీబీ రోడ్డు మీదుగా 11.45గంటలకు పిఠాపురం మండలం కుమారపురం చేరుకుంటారు. ఇక్కడ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన మినీ గోకులాన్ని ప్రారంభిస్తారు. అక్కడ నుంచి 12.15గంటలకు బయలుదేరి 12.25 గంటలకు పిఠాపురం పట్టణంలోని పాతబస్టాండు మునిసిపల్ ఉన్నత పాఠశాలకు చేరుకుంటారు. ఇక్కడ జరిగే సంక్రాంతి సంబరాల్లో పాలుపంచుకుంటారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2గంటల వరకూ అక్కడ జరిగే బహిరంగసభలో పాల్గొంటారు. ఇక్కడ నుంచే పలు అభివృద్ధి పనులను వర్చువల్ విధానంలో ప్రారంభిస్తారు. అనంతరం గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని తన నివాసానికి 2.30గంటలకు చేరుకుంటారు. విరామం అనంతరం మధ్యాహ్నం 3.30కు బయలుదేరి సాయంత్రం 5 గంటలకు రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి మంగళగిరి ప్రత్యేక విమానంలో వెళతారు.


ప్రముఖ కవి అందెశ్రీని సత్కరిస్తున్న ప్రముఖులు


నటి హేమను సత్కరిస్తున్న ప్రముఖులు


బీజేపీ నేత సోము వీర్రాజుకు సత్కారం



తేనెలొలుకు.. తెలుగు

పులకించిన తెలుగు తల్లి

- తరలివచ్చిన భాషాభిమానులు
- వివిధ ప్రాంతాల యాసలతో ప్రతిధ్వనించిన జీజీయూ
- అలరించిన చిన్నారుల సంప్రదాయ నృత్య ప్రదర్శనలు
- అతిథులకు పురస్కారాలు...సత్కారాలు

రాజానగరం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాష మాధుర్యం, వేర్వేరు ప్రాంతాల యాసలతో తెలుగు తల్లి పులకించింది. గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న 2వ ప్రపంచ తెలుగు మహాసభల ముగింపు కార్యక్రమాలు గురువారం ఘనంగా జరిగాయి. మాతృభాషను కీర్తిస్తూ పలువురు రాజకీయ ప్రముఖులు, కవులు, రచయితల ప్రసంగాలతో తెలుగు తల్లి ఉప్పొంగి పోయింది. తెలుగు భాష మాధుర్యాన్ని ఆస్వాదిస్తూ భాషాభిమానులంతా తన్మయత్వంలో మునిగితేలారు. జీజీయూ కులపతి కలిదిండి సత్యనారాయణరాజు(చైతన్యరాజు) అధ్యక్షతన రాజరాజ నరేంద్ర వేదికపై ప్రారంభమైన రెండో రోజు వేడుకలకు రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి సభాధ్యక్షత వహించగా, ఎస్పీ నరసింహ కిషోర్ దంపతులు శంఖారావం పూరించి సభలను ప్రారంభించారు. పలువురు రాజకీయ సాహితీ ప్రముఖులు, అవధానులు, కవులు, రచయితలు, కళాకారులు తెలుగు భాష ఔన్నత్యాన్ని వెలుగెత్తి చాటారు. జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యులు జ్యోతుల నెహ్రూ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ తెలుగు మహాసభలను పురస్కరించుకుని జీజీయూ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పలువురు కవులు, రచయిత్రుల విగ్రహాలను చూస్తుంటే తెలుగుదనం ఉట్టిపడుతుందన్నారు. ఇటువంటి సభలను గ్రామీణ ప్రాంతాలకు కూడా చేరువచేసి మరుగున పడుతున్న మాతృభాషను, సంస్కృతిని పరిరక్షించాలని చైతన్యరాజుకు సూచించారు. అమెరికాలో పుట్టిన పిల్లలు సైతం తెలుగులో మాట్లాడుతున్నారని, తెలుగు భాష పరిరక్షణ ఒక ఉద్యమం మాదిరిగా గ్రామీణ స్థాయికి తీసుకెళ్లి మరింత పటిష్టం చేయాలన్నారు.

తెలుగు భాష, సంస్కృతికి.. పుట్టినిల్లు

గోదావరి ప్రాంతం తెలుగు భాష, సంస్కృతికి పుట్టినిల్లు వంటిదని మరో కవి నడింపల్లి కృష్ణ తెలుగు భాష గొప్పదనాన్ని వివరించారు. తెలుగు భాష మానవతా విలువలను నేర్పుతుందని, దానిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. తెలుగు భాష జీవితాన్నిస్తుందని, ఆస్ట్రేలియాలో తెలుగు కోసం, తెలుగు వారి కోసం తెలుగు బడులు ప్రారంభించామన్నారు. ఆస్ట్రేలియాలో తెలుగు భాషను ఆప్షనల్ సబ్జెక్టుగా ఎంపిక చేసుకునే విధంగా ప్రయత్నిస్తున్నామన్నారు. రానున్న ఏడాదిలో ఆస్ట్రేలియాలో ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించ తలపెట్టామని, దానికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని ఈ సందర్భంగా చైతన్యరాజును కోరారు.

ఒదుగుదల భాష తెలుగు

కవి గరిమెళ్ల వరప్రసాద్

కవి గరిమెళ్ల వరప్రసాద్ మాట్లాడుతూ తెలుగు భాష ఒదుగుదల కలిగిన భాషగా చెప్పారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర, నెల్లూరు ప్రాంతాలకు ఒక యాస ఉంటుందంటూ ఆయా ప్రాంతాల యాసలతో తిరుపతి వెంకటకవుల రచించిన పద్యాలను ఆలపించారు. తెలుగు భాష కొంత నేర్చుకుంటే చాలు పద్యాలను అలవోకగా రాయవచ్చంటూ కవితలు, రచనలతో తెలుగు భాష తియ్యదనాన్ని చాటిచెప్పారు. మరో ముఖ్యఅతిథి, భారతీయ కవి, గేయరచయిత అందెశ్రీ మాట్లాడుతూ తెలుగు భాషకు విఘాతం కలుగుతుందనే ఉద్దేశంతో మరే భాషను నేర్చుకోలేదన్నారు. ప్రస్తుత సమాజంలో మనుషుల్లో మానవత్వం కొరవడుతుందని, మాయమైపోతున్నాడమ్మా..మనిషన్నవాడు అనే పాటను ఆలపిస్తూ అందరి హృదయాలను కదిలించారు. సిలికాన్ ఆంధ్ర మన బడి వ్యవస్థాపకుడు చామర్తి రాజు మాట్లాడుతూ తెలుగు భాష మృత భాష కాదని, అమృత భాష అని అభివర్ణించారు. తెలుగు భాష కోసం తాను చేస్తున్న ఉద్యమంలో భాష నేర్పేందుకు సిలికాన్ ఆంధ్ర సిద్ధంగా ఉందన్నారు. తెలుగు భాష వైభవాన్ని జీజీయూ ప్రాంగణంలో కూడా కొనసాగించాలని చైతన్యరాజు కోరారు.



ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రపంచ తెలుగు మహాసభలు ముగింపు వేడుకల్లో భాగంగా గురువారం వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థినులు తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ చేసిన పలు శాస్త్రీయ, సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు అందరినీ అలరించాయి.



అతిథులకు సత్కారాలు

రాజానగరం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ తెలుగు మహా సభలను పురస్కరించుకుని పలువురు రాజకీయ ప్రముఖులు, సాహితీవేత్తలు, కవులు, కళాకారులను జీజీయూ కులపతి చైతన్యరాజు సారధ్యంలో పలువురు మంత్రులు సమక్షంలో ఘనంగా సత్కరించి, పురస్కారాలు అందజేశారు. దీనిలో భాగంగా ఎస్పీ నరసింహ కిషోర్ దంపతులను, మాజీ మంత్రి కనుమూరి బాపిరాజు దంపతులను సత్కరించి పురస్కారాన్ని అందజేశారు. అలాగే చామర్తి రాజు, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, కవి గరిమెళ్ల వరప్రసాద్, వసుధా ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామరాజు, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ లంక దినకర్, అందె శ్రీను, గోపిమూర్తిలను ఘనంగా సన్మానించి, పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో జీజీయూ ఉపకులపతి ఉదయగిరి చంద్రశేఖర్, ప్రోఛాన్సలర్ శశికిరణ్ వర్మ, మాజీ ఎమ్మెల్సీ రవివర్మ, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు, రాజానగరం నియోజకవర్గ ఇన్‌చార్జి నీరుకొండ వీరన్నచౌదరి, జీజీయూ అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాతృభాష ఎంతో మధురం

లంక దినకర్

20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంక దినకర్ మాట్లాడుతూ మాతృభాషలో ఉన్న మాధుర్యం మరే భాషలోనూ లేదన్నారు. శ్రీకృష్ణ దేవరాయలు మన ప్రాంతానికి విచ్చేసి సేదదీరిన సమయంలో ఆలపించిన పద్యాలను మరో మారు గుర్తు చేస్తూ ఆలపించారు. ఈ జగత్తులో తెలుగు భాష ఉన్నంత కాలం దిగ్విజయంగా ఉండాలని, ప్రధాని నరేంద్ర మోదీ మాతృభాషపై దృష్టిసారిస్తున్నారన్నారు. ప్రపంచ వ్యాప్తంగా తెలుగు భాషను చాటిచెప్పాలన్నారు.

అమ్మను మర్చిపోయినట్టే..

ఎమ్మెల్యే బత్తుల

తెలుగు భాషను మర్చిపోతే అమ్మను మర్చిపోయినట్లే అవుతుందని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. తెలుగు భాషాభివృద్ధికి చైతన్యరాజు చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. తెలుగు మధురంగా ఉంటుందన్నారు.

తెలుగింటి అమ్మాయిని కావడంతోనే నాకీ ఆదరణ

నటి హేమ

మీరందరూ నన్ను ఇంతగా అభిమానించడానికి కారణం నేను గోదావరి జిల్లా అమ్మాయిని.. రాజోలు అమ్మాయిని.. తెలుగు అమ్మాయిని. 500 లకు పైగా సినిమాల్లో నటించానంటే అందుకు ప్రధాన కారణం నా తెలుగు భాష. మా అమ్మ, నాన్న ఆకారాన్నిస్తే నా వెటకారంతో ఆర్టిస్టును కాగలిగాను.. లక్షలాది మంది అభిమానుల హృదయాల్లో స్థానాన్ని సంపాదించగలిగానన్నారు.నన్ను ఆదరించడానికి కారణం తెలుగు భాష అన్నారు. మా అమ్మ, తమ్ముడు అందరూ గోదావరి జిల్లా రాజోలులోనే ఉంటున్నారు అందుకే ప్రతి ఏడాది సంక్రాంతికి ఇక్కడికే వస్తా.. నా గోదావరి జిల్లా అంటే చాలా ఇష్టం. ఇక్కడ పుట్టడం నా అదృష్టంగా భావిస్తా. నన్ను గోదావరిలో ఈత కొట్టించడం మా నాన్నకు ఇష్టం. నాన్న కోసం గోదావరిలో సగం ఈత కొట్టాను. మధ్యలోనే చదువు ఎగ్గొట్టి సినీ ఇండస్ట్రీకి వెళ్లిపోయాను. నాకు చదువు రాకపోయినా నన్ను ఆదరించి, అభిమానించింది మాత్రం తెలుగు భాష వల్లే అని గర్వంగా చెప్పుకుంటానన్నారు. ముస్లిం ఇళ్లలో ఖురాన్ ఉంటుంది. క్రైస్తవులు ఇళ్లలో బైబిలు ఉంటుంది. ప్రతి హిందువు ఇళ్లలో భగవద్గీత ఖచ్చితంగా ఉండి తీరాలన్నారు. చివరిగా గోదావరి యాసలో నమస్తే అండీ, బాగున్నారండీ, ఎప్పుడొచ్చారూ, భోంచేసి వెళ్లండే అంటూ అందరినీ కడుపుబ్బ నవ్వించి ముగించారు.


అన్నవరంలో పుష్పాలంకరణతో ఏర్పాటుచేసిన తూర్పురాజగోపురం ప్రక్కన నమూనాలయం

నేడు సత్యదేవుడి ఉత్తరద్వార దర్శనం

- పుష్పాలంకరణలో ఆలయం ముస్తాబు
- తిరుపతి సంఘటన నేపథ్యంలో ప్రత్యేక జాగ్రత్తలు

అన్నవరం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడికి ముక్కోటి ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని శుక్రవారం స్వామి,అమ్మవార్లు ఉత్తరద్వారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. దీనికి సంబంధించి ఆలయాన్ని వివిధ సుగంధభరిత పుష్పాలతో అలంకరించారు. ఉత్తరద్వారాన్ని సర్వాంగసుందరంగా ముస్తాబుచేయించారు. తూర్పురాజగోపురం ప్రక్కన నమూనాలయం మాదిరి ఏర్పాటుచేశారు. ప్రధానాలయంలో మూలవరులను, వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామి,అమ్మవార్ల ఉత్సవమూర్తులను శేషపాన్పుపై పవళించే శ్రీమహావిష్ణువుగా సత్యదేవుడిని, ఆయన పాదాలు సుతిమెత్తగా ఒత్తుతున్న లక్ష్మీదేవిగా అమ్మవారిని అలంకరించి ఏకకాలంలో మూలవరులు, ప్రత్యేక అలంకరణలోఉన్న ఉత్సవమూర్తులను భక్తులు దర్శించేవిధంగా ఏర్పాటుచేశారు. ఉదయం 5గంటలనుంచి సాయంత్రం 5గంటల వరకు భక్తులకు ఉత్తరద్వారం లో సత్యదేవుడిని దర్శించుకునే అవకాశం కల్పించారు. సుమారు 50వేలమంది భక్తులు స్వామిని దర్శించుకుంటారని అంచనావేస్తూ దానికనుగుణంగా అధికారులు ఏర్పాట్లుచేశారు. భక్తులకు కదంబప్రసాదాన్ని అందించనున్నారు.

దేవస్థానంలో సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలి

- భక్తుల సేవలే పరమావధిగా వ్యవహరించాలి
- ఆర్థిక పరిస్థితి బాగాలేనందున వృథాఖర్చులు తగ్గించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఈవో సుబ్బారావు

అన్నవరం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): దేవస్థానంలో పనిచేసే ప్రతి ఉద్యోగి చిత్తశుద్ధితో పనిచేయడంతో పాటుగా భక్తుల సేవలే పరమావధిగా వ్యవహరించాలని ఈవో సుబ్బారావు సూచించారు. గురువారం సాయంత్రం దేవస్థానంలో అన్ని విభాగాలలో ఉద్యోగులందరితో సమావేశం నిర్వహించారు. ఇటీవల దేవదాయ కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్ వోపీ ఆదేశాలను వివరించారు. దేవస్థానంలో ఆర్థికపరిస్థితి అంతంతమాత్రంగా ఉందని, వృథా ఖర్చులు తగ్గించాలని సూచించారు. సిబ్బంది తరుపున వచ్చేవారికి ప్రత్యేక దర్శన టిక్కెట్లు కనీసం సగమైనా తీయించాలని తద్వారా కొంత ఆదాయం పొందవచ్చునని సూచించారు. ప్రసాదం విభాగంలో పనిచేసే సూపరింటెండెంట్‌కు అదనపు విభాగం అప్పగించకూడదని తద్వారా పూర్తి పర్యవేక్షణతో పనిచేస్తారని అన్నారు, ఆలయాలకు విచ్చేసే భక్తులకు దర్శనం, వ్రతక్యూలైన్‌లు పటిష్ఠంగా ఉండాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రతి ఒక్కరూ డ్రెస్‌కోడ్ పాటించి గుర్తింపుకార్డు ధరించాలన్నారు. భక్తుడు కొండదిగువ నుంచి కొండపైకి వచ్చేవరకు తనకు కావలసిన సౌకర్యాలు ఎక్కడ లభిస్తాయో తెలిసేవిధంగా ఎక్కడికక్కడ సైన్‌బోర్డులు ఏర్పాటుచేయాలన్నారు. సమావేశంలో ఈఈలు, ఏఈవోలు, సూపరింటెండెంట్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

క్యూలైన్లు పరిశీలన : తిరుపతి సంఘటన నేపథ్యంలో అన్నవరం దేవస్థానంలో క్యూలైన్లను ఈవో సుబ్బారావు పరిశీలించారు. క్యూలైన్‌లు పటిష్ఠంగా ఉండాలని భక్తులను ఒక్కసారిగా వదలకుండా నిరంతరం క్యూలైన్‌ద్వారా భక్తుల నడకసాగేలా చూడాలని సూచించారు.

ముక్కోటికి ఏర్పాట్లు పూర్తి

- 50వేలు పైబడి భక్తులు వస్తారని అంచనా
- త్వరితగతిన దర్శనాలు జరిగేలా అధికారుల సమాయత్తం



పుష్పాలంకరణలో వాడపల్లి వెంకన్న ఆలయం, ముక్కోటి సప్త ద్వారాలు

ఆత్రేయపురం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి పర్వదిన ఏర్పాట్లు చురుగ్గా నిర్వహిస్తున్నారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలిరానున్న భక్తులకు సకాలంలో స్వామి దర్శనం అందించేలా ఏర్పాట్లు నిర్వహిస్తున్నారు. వైకుంఠ ద్వారం వద్ద సప్తద్వారాలను ఫలపుష్పాలతో అలంకరిస్తున్నారు. వసంత మండపం ముఖమండపం, అంతరాలయం, ప్రకార మండపాలను వివిధ రకాల పుష్పాలతో అలంకరిస్తున్నారు. భక్తులు వెళ్లే ద్వారాలవద్ద సుంగధ పరిమళాలు వెదజల్లే పుష్పాలను అలంకరిస్తున్నారు. శేషపాన్పుపై శ్రీమహావిష్ణువు ఉత్తర ద్వారం వద్ద కొలువుతీరి భక్తులను కటాక్షించనున్నారు. తెల్లవారుజామున 4 గంటల నుంచి తిరుప్పావై సేవ అనంతరం భక్తులకు ప్రముఖులకు దర్శనాలను అందించనున్నారు. ఉదయాన్నే గరుడవాహనంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహించనున్నారు. రాత్రి వరకు భక్తులకు వైకుంఠ ద్వారం గుండా స్వామివారిని దర్శించుకునే ఏర్పాట్లు చేస్తున్నారు. 50వేలు పైబడి భక్తులు రానున్నట్లు అంచనావేసి ఆదిశగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ ఉపకమీషనర్ నల్లం సూర్యచక్రధరరావు ఏర్పాట్లు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఏర్పాట్లపై రాష్ట్ర కమిషనర్ సూచనలు

వైకుంఠ ఏకాదశి సందర్భంగా వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు చేపడుతున్న ఏర్పాట్లపై రాష్ట్ర దేవదాయ కమిషనర్ సత్యనారాయణ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో భక్తులు మృతి చెందిన సంఘటనపై కమిషనర్ గురువారం 13 జిల్లాలోని ఈవోలతో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా శుక్రవారం వేలాది మంది భక్తులు తరలిరానున్న నేపథ్యంలో ఎటువంటి తోపులాటలు జరుగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కమిషనర్ ఆదేశించారు. వృద్ధులు, చిన్నారులు, దివ్యాంగులకు బిస్కట్లు, పాలు, ప్రసాదం పంపిణీ చేయడంతోపాటు త్వరితగతిన దర్శనాలు జరిగేలా ఏర్పాట్లుచేయాలని ఆదేశించారు. క్యూలైన్లలో భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేపట్టి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చూడాలన్నారు. దేవదాయశాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ కె.సుబ్బారావు వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు అందించాల్సిన సౌకర్యాలను, దర్శనాలను త్వరితగతిన అందించాలని తగుసూచనలు అందించారు. ఎస్ఐ ఎస్.రాము, తహశీల్దారు రాజేశ్వరరావులు వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లను పరిశీలించారు.

ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా ఎస్పీ

తిరుమల ఘటన నేపథ్యంలో వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని గురువారం రాత్రి జిల్లా ఎస్పీ కృష్ణారావు సందర్శించారు. వెంకన్న ఆలయానికి ముక్కోటి ఏకాదశి సందర్భంగా శుక్రవారం భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో చేపట్టే ఏర్పాట్లపై ఆయన పరిశీలించారు. భారీకేడ్లు, క్యూలైన్లు, తదితర ఏర్పాట్లను పరిశీలించి ఉపకమీషనర్ నల్లం సూర్యచక్రధరరావుతో ఆయన సమీక్షించారు. ఎటువంటి సంఘటనలు జరుగకుండా చర్యలు చేపట్టనున్నారు. ఈయన వెంట డీఎస్పీ గోవిందరావు, సీఐ విద్యాసాగర్, ఎస్ఐ ఎస్.రాము ఉన్నారు.


ఆలయంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్‌జేసీ సుబ్బారావు


వాడపల్లిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ కృష్ణారావు


వాడపల్లి వెంకన్న ఆలయంలో ధ్వజస్తంభానికి పుష్పాలంకరణ

వాడపల్లిలో ఉత్తరద్వార దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి

ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడు

అమలాపురం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో చేస్తున్న ఏర్పాట్లపై జిల్లా అధికారులతో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కె.అచ్చెన్నాయుడు గురువారం ఫోన్‌లో మాట్లాడి పలు సూచనలు చేశారు. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటున్న నేపథ్యంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, ఎస్పీ బి.కృష్ణారావులను ఆదేశించారు. వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానానికి ఉత్తర ద్వార దర్శనానికి వేలాది మంది భక్తులు వస్తున్న నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వేలాదిగా తరలివచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు.

అప్పనపల్లి బాలబాలాజీ ఆలయం సిద్ధం

మామిడికుదురు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ముక్కోటి ఏకాదశి పర్వదినాన్నిపురస్కరించుకుని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా మామిడి కుదురు మండలం అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారు శుక్రవారం వైకుంఠ ద్వారం ద్వారా దర్శనం ఇస్తారు. వైకుంఠ ద్వార దర్శనాన్ని పురస్కరించుకుని దేవస్థానాన్ని వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాటుప్ల చేసినట్టు దేవస్థానం సహాయ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.



అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానంలో పూలతో అలంకరించిన ధ్వజస్తంభం

వైభవంగా భద్రగిరి రాములోరి తెప్పోత్సవం


బోట్‌లో ఆశీనులైన స్వామివారు, గోదావరి నదిలో తెప్పోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

విఆర్‌పురం, జనవరి 9(ఆంధ్రజ్యోతి) రెండో భద్రగిరిగా పేరుగాంచిన వీఆర్‌పురం మండలంలోని శ్రీరామగిరి కొండపైఉన్న శ్రీసుందర సీతారామ చంద్రస్వామివారి తెప్పోత్సవం వైభవంగా జరిగింది. ముక్కోటి పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం సాయంత్రం స్వామివారిని ఆలయం నుంచి పురవీధుల గుండా హంసవాహనంపై ఆశీనులనుగావించి పవిత్ర గోదావరిలో అర్చకుడు పురుషోత్తమాచార్యులు స్వామివారిని బోట్‌పై ఆశీనులను చేసి తెప్పోత్సవం నిర్వహించారు. రాములోరి తెప్పోత్సవాని తిలకించేందుకు మండలంలోని వీఆర్‌పురం, వడ్డిగూడెం, రేఖపల్లి, సీతంపేట రాజుపేట తదితర గ్రామాల నుంచి భక్తులు పాల్గొన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు పెందుర్తి సుదర్శన్, జడ్పీటీసీ వాళ్ల రంగారెడ్డి, ఎంపీపీ కారం లక్ష్మి, మాజీ జడ్పీటీసీ ముత్యాల రామారావు, బీరక సూర్యప్రకాష్‌రావు పాల్గొన్నారు.

హెచ్‌ఎంపీవీ వైరస్..
భయాందోళన వద్దు



- శీతాకాలంలో కాలనుగుణ వ్యాధి
- అవగాహనతోనే ఆరోగ్య రక్షణ
- ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే చాలు
- కాకినాడ జీజీహెచ్‌లో ప్రత్యేక వార్డు ఏర్పాటు

కరోనా వైరస్.. ఈ పేరు వింటేనే ప్రజలు ప్రాణభయంతో గజగజవణికిపోయేవారు. ఈ వైరస్ బారిన పడి చాలామంది మరణించారు. ప్రపంచాన్ని వణికించిన కొవిడ్ మహమ్మారి శకం ముగిసింది. కానీ చైనా నుంచి మరో ప్రాణాంతక వైరస్ ఇప్పుడిప్పుడే విస్తరిస్తోంది. ఈ వైరస్ పేరు హ్యూమన్ మెటాన్యూమో వైరస్(హెచ్‌ఎంపీవీ). ఇది కర్నాటక రాష్ట్రంలో తొలిసారిగా రెండు కేసులు నమోదైనట్లు నిర్ధారణ కావడం పట్ల ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ఈ వైరస్ రెస్పిరేటరీ సిన్సిటియల్ వైరస్, ఫ్లూ వంటి వ్యాధులతో సోకుతుంది.

జీజీహెచ్(కాకినాడ), జనవరి9(ఆంధ్రజ్యోతి): భారత్‌లో తొలిసారిగా కర్నాటక రాష్ట్రంలో ఈ వైరస్ బాధిత కేసు నమోదైంది. బ్రాంకైటిస్‌తో బాధపడుతున్న 3నెలల చిన్నారిలో హెచ్‌ఎంపీవీ వైరస్ లక్షణాలు గుర్తించారు. 2వ కేసు కూడా జనవరి 3న కర్నాటకలో బ్రాంకైటిస్‌తో బాధపడుతున్న 8నెలల బాలుడిని గుర్తించి వైద్యులు చికిత్స అందించి డిశ్చార్జి చేశారు. ఈ వైరస్‌పై ఇప్పటికే ప్రపంచ ఆరోగ్య సంస్థ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఐసీఎంఆర్‌ని అలర్ట్ చేసింది. సాధారణంగా శీతాకాలంలో సంభవించే కాలానుగుణ వ్యాధిఇది. ఈవైరస్‌పై భయాందోళనలకు గురికానవసరం లేదని, అవగాహనతో ఆరోగ్యంగా ఉండవచ్చని రిటైర్డు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) డాక్టర్ ఎం.రాఘవేంద్రరావు తెలిపారు. ఈ వైరస్ నివారణపై తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు.

ఇలా వ్యాపిస్తుంది..



ఈ వైరస్ తుమ్ములు, దగ్గువల్ల వెలువడే తుంపర్ల నుంచి ఇతరులకు సోకుతుంది. వైరస్ బారిన పడిన వారికి దగ్గర, సన్నిహితంగా ఉన్నవారికి సోకుతుంది. బాధితులను తాకడం, ఆ చేతులతో ముక్కు, కళ్లు, నోటిని తాకినప్పుడు ఈ వైరస్ సోకే అవకాశాలు ఉన్నాయి.

నివారణకు తీసుకోవాల్సిన చర్యలు



ఈ వైరస్ ప్రమాదకారి కాదు. చలికాలంలో చిన్నారులు, వృద్ధులు, వ్యాధి నిరోధకశక్తి తక్కువగా ఉన్నవారిని ఇబ్బందులకు గురి చేస్తుంది. కొన్ని స్వీయ జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వైరస్ బారిన పడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. చేతులను తరచూ సబ్బుతో కనీసం 20సెకన్లపాటు శుభ్రమైన నీటితో కడుక్కోవాలి. చేతులను శుభ్రం చేసుకోకుండా నోరు, ముక్కు, కళ్లను తాకరాదు. బహిరంగ ప్రదేశాల్లో మాస్క్ లు ధరించాలి. వైరస్ బారిన పడితే బయట తిరగరాదు. ఇలా బయట సంచరించడం ద్వారా ఒకరి నుంచి మరొకరికి సులువుగా సోకే అవకాశాలు ఉన్నాయి.

ఇదొక సాధారణ ఫ్లూ

శీతాకాలంలో హ్యూమన్ మెటాన్యూమో వైరస్(హెచ్‌ఎంపీవీ) సోకుతుంది. ఇది ఒక సాధారణ ఫ్లూ.. జలుబు, దగ్గు వంటి లక్షణాలు కనిపిస్తాయి. సాధారణంగా చిన్నారులు, పెద్దలకు సోకుతుంది. దగ్గు తగ్గకపోవడంతోపాటు ఊపిరి తీసుకోవడం కష్టంగా ఉంటుంది. చైనాలో కేసులు పెరగడంతో కొవిడ్ నేపథ్యంలో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. ఇది కొవిడ్-19 ఫ్లూ. ఇతర శ్వాస కోశ రుగ్మతలను పోలి ఉంటుంది. జ్వరం రావడం, దగ్గు, ముక్కు కారడం, గొంతు నొప్పి వంటి లక్షణాలు ఉంటాయి. వైరస్ తీవ్రత ఎక్కువగా ఉన్న వారిలో బ్రాంకైటిస్, నిమోనియాకు దారితీయవచ్చు. ఇన్‌ఫెక్షన్ సోకిన 3 నుంచి 6 రోజుల్లోగా ఈ లక్షణాలు బయట పడతాయి. ఇమ్యూనిటీ తక్కువగా ఉన్న వారిపై ఈ వైరస్ ప్రభావం చూపుతుంది.

భయాందోళన చెందాల్సిన పనిలేదు

హ్యూమన్ మెటాన్యూమో వైరస్(హెచ్‌ఎంపీవీ) ఇది సాధారణ ఫ్లూ. శీతాకాలంలో అందరిలో జలుబు, దగ్గు తదితర ఫ్లూ లక్షణాలు ఉంటాయి. రోగ నిరోధకశక్తి తక్కువగా ఉండే చిన్నారులు, వృద్ధులకు ఈ ఫ్లూ సోకుతుంది. కొవిడ్‌తో పోల్చుకుంటే ఇది ప్రమాదకరం కాదు. బ్రాంకైటిస్, నిమోనియాతో బాధపడుతున్న వారిని ఈ వైరస్ ఇబ్బంది పెడుతుంది. స్వీయ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి. జీజీహెచ్, పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల్లో ఫ్లూ నివారణకు పలు రకాల వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి.

-డాక్టర్ ఎం.రాఘవేంద్రరావు, రిటైర్డు డీఎంఈ, కాకినాడ



కాకినాడ జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక వార్డు





సాయంకాలం సెలవంటూ..!

సాయం సంధ్య వేళ.. సెలవంటూ చీకట్లోకి జారుకుంటూ.. కాకినాడ-సామర్లకోట మధ్య సూర్యాస్తమయం సమయంలో సూర్యుడు ఇలా చిక్కాడు

-ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్, కాకినాడ

ఎంఎస్‌వో పేరిట ఎండీయూ ఆపరేటర్ అక్రమ వసూళ్లు

ఆపరేటర్లకు సెల్‌లో వాయిస్ మెసేజీలు వైరల్

సామర్లకోట, జనవరి 9(ఆంధ్రజ్యోతి): సామర్లకోట ఎంఎస్‌వోగా పనిచేస్తున్న అధికారికి మండలంలో ఎండీయూ ఆపరేటర్లు ఒక్కొక్కరూ రూ.200 చొప్పున ఇవ్వాలని మండల రేషన్ ఎండీయూ ఆపరేటర్ల సంఘ ప్రతినిధి, ఇటీవల కాలంవరకూ వైసీపీ నాయకులతో అంటకాగిన వ్యక్తి వాయిస్ మెసేజీ పంపడం వైరల్‌గా మారింది. ఈ మేరకు సదరు వాయిస్ మెసేజీని పలువురి విలేకర్లకు గురువారం ఫార్వార్డ్ చేశారు. జిల్లా సివిల్ సప్లయ్ అధికారి కార్యాలయం నిర్వహణకోసం ఎండీయూ ఆపరేటర్లకు రూ.200 చొప్పున ఫోన్‌పే ద్వారా తన నెంబరుకు పంపాలని, ఆ డబ్బులకు సంబంధించి స్క్రీన్ షాట్‌ను తన ఫోన్‌నెంబరుకు పంపాలని వాయిస్ మెసేజీల ద్వారా తెలిపారు. దీన్ని ఎండీయూ ఆపరేటర్లకు మాత్రమే కాకుండా రేషన్ డీలర్లకు సైతం పంపినట్లు సమాచారం. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సదరు ఎండీయూ ఆపరేటర్‌గా వ్యవహరించిన ఇతను అప్పుడు నిర్వహించిన అన్ని కార్యక్రమాలను స్వయంగా పాల్గొని రేషన్ డీలర్లను బాధ్యులను చేశారు. వైసీపీ ప్రభుత్వం గద్దె దిగి ఏడునెలలు పైబడినా నేటికీ ఇతని వైఖరిపై తమకు తలనొప్పిగా తయారైందని రెవెన్యూ అధికారులు వాపోతున్నారు. దీనిపై సామర్లకోట తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి వాస్తవ సమాచారాన్ని సేకరించాలని వీఆర్వోలను ఆదేశించినట్లు తెలిసింది.

ఉత్సాహభరితంగా 'ఆదిత్య' కలర్స్ యూత్ ఫెస్ట్ ప్రారంభం

గండేపల్లి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): గండేపల్లి మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో కలర్స్-25 యువజనోత్సవాలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో సినీ హీరో నిఖిల్ సిద్ధార్థ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మొదటిరోజు ఉదయం 9.30గంటలకు ప్రారంభమైన కార్యక్రమానికి యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా జేఎన్టీయూకే రెక్టార్ డాక్టర్ కేవీ రమణారావు, గౌరవఅతిథిగా ఐక్వ్రా ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ ఎల్ఎల్‌సీ ఫౌండర్ అండ్ వైస్ ప్రెసిడెంట్ వెంకట్ మాచవోలు, యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ ఎంబీ శ్రీనివాస్, డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్ హాజరయ్యారు.

విద్యార్థులతో ఏర్పాటు చేసిన వివిధ రకాల స్టాల్స్, జెయింట్‌వీల్, కొలంబస్, బ్రేక్‌డాన్స్ వంటి వినోదభరిత వాతావరణంతో ఆదిత్య క్యాంపస్ అంతా పండుగ వాతావరణం సంతరించుకుంది. విద్యార్థులు వివిధ రకాల ఫ్యాషన్ డిజైన్‌లతో కూడిన వస్త్రధారణతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సతీష్‌రెడ్డి మాట్లాడుతూ తొమ్మిదేళ్ల విరామం తర్వాత ఆదిత్య కలర్స్ ఏర్పాటు చేశామన్నారు. సినీ ప్రముఖుల సందడి, లేజర్ షో, విద్యార్థుల ఆటపాటలు ఈ కలర్స్‌లో చోటు చేసుకున్నాయన్నారు. 50వేలమందికి తగ్గకుండా ఏర్పాట్లు చేసి అన్నీ సమకూర్చామన్నారు. స్పోర్ట్స్, గేమ్స్ సాంస్కృతిక విభాగాల్లో పాల్గొనడానికి వివిధ కళాశాలల నుంచి 2వేలమంది విద్యార్థులు రిజిస్టర్ అయ్యారని, 67 కళాశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారని అన్నారు. మొదటిరోజు హీరో నిఖిల్ రాగా, రెండోరోజు కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్, మూడోరోజు హీరో కిరణ్ అబ్బవరం రానున్నట్లు తెలిపారు.

మా కాలేజ్‌లో కలర్స్ లేవు

-హీరో నిఖిల్ సిద్ధార్థ్



నిఖిల్‌ను సన్మానిస్తున్న ఆదిత్య వైస్‌చైర్మన్ డాక్టర్ సతీష్‌రెడ్డి

కలర్స్-25 యువజనోత్సవాల్లో హీరో నిఖిల్ సిద్ధార్థ్ జోష్ పెంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులను చూస్తుంటే ఎంతో ఆనందంగాను, ఈర్ష్యగాను ఉందన్నారు. తాను చదువుకున్న ఇంజనీరింగ్ కళాశాలలో ఇటువంటి కలర్స్ లేవన్నారు. చదువుతోపాటు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమన్నారు. తదనంతరం విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి వారిలో ఉత్సాహాన్ని నింపారు. హ్యాపీడేస్ నుంచి ఇప్పటివరకు 23 సినిమాలు చేశానని, 'ఆదిత్య'లో కిర్రాక్ పార్టీ సినిమా తీశామని యాజమాన్యానికి ఎంతో రుణపడి ఉంటానని తెలిపారు. కిర్రాక్‌పార్టీ సినిమాకు ఆదిత్య వైస్‌చైర్మన్ సతీష్‌రెడ్డి ఎంతో సహకరించారన్నారు.

జగ్గన్నతోట ప్రభల ఉత్సవాల నిర్వహణపై ఆర్డీవో సమీక్ష



ఉత్సవ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీకర్

అంబాజీపేట, జనవరి 9(ఆంధ్రజ్యోతి):సంక్రాంతి కనుమ సందర్భంగా ఈనెల 15న నిర్వహించే అంబాజీపేటమండలం మొసలపల్లిశివారు జగ్గన్నతోట ప్రభల ఉత్సవాన్ని సంప్రదాయంగా ప్రశాంతంగా నిర్వహిద్దామని కొత్తపేట ఆర్డీవో పి. శ్రీకర్ సూచించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం మొసలపల్లి పంచాయతీ కార్యాలయంవద్ద తహశీల్దారు జె.వెంకటేశ్వరి అధ్యక్షతన ఏకా దశ రుద్రులు ఉత్సవ కమిటీ సభ్యులు, ట్రస్ట్ చైర్మన్లు, వివిధ శాఖల అధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా గ్రామాల నిర్వాహకులు మాట్లాడుతూ ప్రభల తీర్థంలో మొబైల్ టాయిలెట్లు, తాగునీరు, ట్రాఫిక్ ఆంక్షలు విధించాలని సూచించారు. ఆర్డీవో మాట్లాడుతూ తీర్థంలో సౌకర్యాలు ఏర్పాటు చే సేలా అధికారులు ఉత్సవ కమిటీ సభ్యులతో సమన్వయంతో పనిచేయాలన్నారు. పారిశుధ్య పనులు, జంగిల్ క్లియరన్స్‌తోపాటు ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. తీర్థం జరిగే ప్రదేశాన్ని పరిశీలించారు. జిల్లా దేవదాయశాఖాధికారి సత్యనారాయణ, ఎంపీడీవో జీవీ సరోవర్, వైద్యాధికారి ఇంద్రావతి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రవీంద్రబాబు, సర్పంచ్‌లు జల్లి బాలరాజు, కాండ్రేగుల శ్రీనివాసరావు, నాయకులు దాసరి సత్యనారాయణ, దంతులూరి శ్రీనివాసరాజు,వాసుదేవానందస్వామీజీ, ఎంపీటీసీలు పబ్బినీడి రాంబాబు, నూకపెయ్యి సత్యనారాయణ పాల్గొన్నారు.

అంతర్వేది ఉత్సవ ఏర్పాట్లపై ఆర్డీవో పరిశీలన



తెప్పోత్సవానికి చెరువును పరిశీలిస్తున్న ఆర్డీవో మాధవి

అంతర్వేది, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మాఘమాసంలో ఫిబ్రవరి 4 నుంచి 13 వరకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం శ్రీలక్ష్మీనరసింహస్వామివారి తిరుకల్యాణ మహోత్సవాల ఏర్పాట్లను ఆర్డీవో కె. మాధవి గురువారం పరిశీలించారు. ముందుగా స్వామి కల్యాణ మండప ప్రదేశం, రథం రోడ్డు, ఆర్టీసీ బస్సులు ప్రవేశ స్థలం, చక్రస్నానం, వసంత మండపం, స్వామివారి తెప్పోత్సవం జరగడానికి కొత్తగా తవ్వుతున్న చెరువు పనులను పరిశీలించి ఆలయ అధికారులతో మాట్లాడారు. తదుపరి సమీక్షా సమావేశానికి ఏర్పాట్లన్నీ పూర్తిస్థాయిలో జరగాలని, సముద్ర స్నానాలకు వెళ్లే రోడ్డు, వసంత మండపానికి వెళ్లే రోడ్డు మరమ్మతులు చేపట్టాలన్నారు. విద్యుత్, పార్కింగ్, ట్రాఫిక్, వైద్యం, పారిశుధ్యం, తాగునీరు తదితర అంశాలపై చర్చించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసేందుకు అధికారులతో సమీక్షిస్తూ ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. రెవెన్యూ, పోలీసు, ఆలయ అధికారులతో కలిసి ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, ఉత్సవ సేవా కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ, సీఐ వి.నరేశ్‌కుమార్, ఎస్‌ఐ కె.దుర్గాశ్రీనివాస్, రాజోలు డిస్ట్రిబ్యూటరీ నీటి సంఘ చైర్మన్ పినిశెట్టి బుజ్జి, ఈవోపీఆర్డీ ఎఫ్ఏసీ కె.సూర్యనారాయణ, డిప్యూటీ తహశీల్దార్ భాస్కర్, సర్వేయర్ భద్రరాజు, ఎంపీటీసీ బైరా నాగరాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సినీ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అచ్యుతరామారావు



అచ్యుతరామారావును అభినందిస్తున్న సభ్యులు

రాజమహేంద్రవరం కల్చరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సినీ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కోళ్ల అచ్యుతరామారావు(శివజ్యోతి) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాజమహేంద్రవరం సూర్య హోటల్‌లో గురువారం కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. కార్యదర్శిగా శ్రీనుబాబు(కాకినాడ శ్రీలక్ష్మీ టాకీస్), కోశాధికారిగా రాంబాబు(మండపేట సత్యశ్రీ), ఉపాధ్యక్షులుగా చినబాబు(పిఠాపురం సత్య థియేటర్), సదాశివరావు(ద్రాక్షారామ), సంయుక్త కార్యదర్శిగా నాని(లక్కవరం వేణుగోపాల్ థియేటర్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 8మంది సభ్యులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో అనుశ్రీ సత్యనారాయణ, సురేష్ మూవీస్ లక్ష్మణరావు, గీతా ఫిలిమ్స్ వెంకటేశ్వరరావు, విజయలక్ష్మి సినిమాస్ అంజి, గౌరీ శంకర్, సత్తిరెడ్డి, హరిబాబు, జగ్గంపేట శివ, సూరపరాజు, సత్యకుమార్ తదితర ఎగ్జిబిటర్లు పాల్గొన్నారు.

చలిమంటకు పూరిల్లు దగ్ధం

- వృద్ధుడి సజీవ దహనం
- తుని పట్టణంలో ఘటన

తునిరూరల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): తుని పట్టణంలో పూరిల్లు దగ్ధమై వృద్ధుడు సజీవ దహనమైన ఘటన సంచలనం రేకెత్తించింది. తుని పట్టణం రామకృష్ణ కాలనీలో జ్యోతినగర్ లో నివాసం ఉంటున్న తాతపూడి చిన్నయ్య (64) బుధవారం చలి మంట వేసుకుని నిద్రిస్తున్నాడు. ఈ సమయంలో పూరిల్లు అంటుకుని మంటలు చెలరేగాయి. ఆ వృద్ధుడు ఇంట్లోనే ఉండిపోవడంతో మంటలు ఎగిసిపడి బయటకు వచ్చేందుకు అవకాశం లేకపోయింది. దీంతో కేకలు వేసినప్పటికీ అర్ధరాత్రి కావడంవల్ల స్థానికులు ఎవరూ సకాలంలో కాపాడే ప్రయత్నం చేయలేకపోయారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది సంఘటనాస్థలానికి చేరుకుని మంటలు అదుపుచేశారు. ఈ వృద్ధుడు అప్పటికే మంటల్లో సజీవ దహనమయ్యాడు. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు ఆడపిల్లలు ఉండగా ఇటీవల భార్యతోపాటు కుమారుడు మరణించాడు. అప్పటినుంచి కూతుళ్ల సంరక్షణలో ఈ పూరింట్లోనే తలదాచుకుంటున్నాడు. ఘటనా స్థలాన్ని తుని పట్టణ సీఐ గీతా రామకృష్ణ పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



అగ్నిప్రమాదంలో సజీవ దహనమైన వృద్ధుడు

24కిలోల గంజాయి స్వాధీనం

- కోటనందూరు సమీపంలో ఇద్దరిని అరెస్టు చేసిన పోలీసులు
- కారు స్వాధీనం



కోటనందూరులో గంజాయితో ఇద్దరిని అరెస్టు చేసిన పోలీసులు

కోటనందూరు,జనవరి 9(ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం-తుని రహదారిపై కోటనందూరు సమీపంలో గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరిని బుధవారం రాత్రి అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలివి. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం ప్రాంతం నుంచి ఓ కారులో తరలిస్తున్న 24.3కిలోల గంజాయిని బాపట్ల జిల్లా రామాలయానికి చెందిన మరుప్రోలు నాగేంద్రరెడ్డి, కందాల చిరంజీవి తీసుకువెళ్తుండగా కోటనందూరువద్ద పట్టుకున్నామని సీఐ చెన్నకేశవరావుతెలిపారు.దీనివిలువ రూ.48వేలు ఉంటుందన్నారు. తహశీల్దార్ సుభాష్ సమక్షంలో ఇద్దరిని అరెస్టుచేసి కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

- ఐషర్ వ్యాన్‌లోకి దూరిన బైక్
- మోటార్‌సైకిలిస్టుకు తీవ్రగాయాలు



పిండ్రాల చిన్నయ్య(ఫైల్)

కొత్తపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కొత్తపేట మండలం పలివెల వంతెన సమీపంలో గురువారం ట్రాక్టర్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందగా మరొక మోటార్‌సైకిలిస్టు తీవ్రంగా గాయపడినట్లు కొత్తపేట ఎస్‌ఐ జి.సురేంద్ర తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేట మండల పరిధి పలివెల గ్రామానికి చెందిన పిండ్రాల చిన్నయ్య(31) చికెన్ దుకాణం సమీపంలో కొబ్బరికాయలతో రోడ్డు దాటుతుండగా అమలాపురంవైపు నుంచి వస్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి రోడ్డు దాటుతున్న చిన్నయ్యను ఢీకొట్టి అతడిపై నుంచి వెళ్లి పోయింది. దీంతోపాటు రోడ్డుపై వెళ్తున్న ద్విచక్ర వాహనదారుడ్ని ఢీకొట్టగా అతడు వాహనంతోపాటు రోడ్డు అవతలి వైపున నిలిచి ఉన్న ఐషర్ వ్యానులోకి దూరిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ప్రమాదంలో పిండ్రాల చిన్నయ్య అక్కడికక్కడే మృతిచెందగా మోటార్‌సైకిలిస్టు కొత్తపేట మండల పరిధి కొత్తపాలేనికి చెందిన కొప్పిశెట్టి వెంకరమణకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతడిని స్థానిక ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్యంకోసం కాకినాడ తరలించారు. ఈ ఘటనపై మృతుని తండ్రి పిండ్రాల పెదపెద్దింట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేంద్ర తెలిపారు.



సంఘటనాస్థలంలో చిన్నయ్య మృతదేహం

ఉమ్మడి జిల్లాలో నాటు సారా నియంత్రించాలి

ఏపీ డైరెక్టర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రాహుల్‌దేవ్‌శర్మ

కలెక్టరేట్(కాకినాడ), జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో నాటుసారాను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రాహుల్‌దేవ్ శర్మ ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో కాకినాడ, తూర్పుగోదావరి, అంబేడ్కర్ కోనసీమ జిల్లాల ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారుల సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ కట్టడి చేయాలని, మద్యంషాపులు, బార్లలో జరిగే నేరాలను నియంతించాలని అన్నారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ చైతన్యమురళి, కాకినాడ అసిస్టెంట్ కమిషనర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రేణుకా, తూర్పుగోదావరి అసిస్టెంట్ కమిషనర్ శివప్రసాద్ తదితరలు పాల్గొన్నారు.

రగ్గుకు సిగరెట్టు అంటుకుని తీవ్రగాయాలు

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

కొత్తపేట, జనవరి 9(ఆంధ్రజ్యోతి):కొత్తపేట శ్రీరామ్‌నగర్ ప్రధాన రహదారి పక్కన నివసిస్తున్న పిల్లి సత్యనారాయణ(68) అనే వ్యక్తి బుధవారం మంచంపై పడుకుని సిగరెట్టు కాలుస్తుండగా ప్రమాదవశాత్తూ రగ్గుకు అంటుకుని కాలిపోయింది. దీంతో అతడిని కొత్తపేట ప్రభుత్వాస్పత్రికి అక్కడినుంచి మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందినట్లు కొత్తపేట పోలీసులు తెలిపారు. అతడి కుమారుడు పిల్లి శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ సువర్ణరాజు తెలిపారు.

గోదావరి కాలువలో దూకి వ్యక్తి గల్లంతు

సామర్లకోట, జనవరి 9(ఆంధ్రజ్యోతి): సామర్లకోట రైల్వే గేట్ సమీపాన గోదావరి కాలువపై నిర్మించి వంతెన రక్షణగోడ నుంచి దూకి ఓ లోకల్ పత్రిక జర్నలిస్టు గురువారం రాత్రి గల్లంతయ్యాడు. సంఘటనా సమాచారం తెలిసిన వెంటనే సామర్లకోట సీఐ కృష్ణభగవాన్ సంఘటనా స్థలికి చేరుకుని అతడి ఆచూకీకోసం ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. కాకినాడ జిల్లా పెదపూడికి చెందిన సలీం అనే వ్యక్తి స్థానిక నిఘా పత్రిక జర్నలిస్టు. అతడు గురువారం ఓ మహిళతో కలిసి మోటార్‌సైకిల్‌పై సామర్లకోట మీదుగా కాకినాడ వెళ్తున్నాడు. రైల్వేగేట్ సమీపించే సరికి గోదావరి కాలువ పక్కన మోటార్‌సైకిల్ నిలుపుదల చేసి మూత్రవిసర్జనకు వెళ్తున్నానని ఆమెకు చెప్పి వంతెనపై నుంచి కాలువలోకి దూకేసినట్లు భావిస్తున్నారు. అటుగా వెళ్తున్న రైతులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలిలో ఉన్న మహిళనుంచి సమాచారాన్ని సేకరిస్తున్నారు.

నలుగురికి జైలుశిక్ష

కపిలేశ్వరపురం,జనవరి9(ఆంధ్రజ్యోతి): దొంగతనం కేసులో నలుగురికి ఆలమూరు జేఎఫ్‌సీఎం కోర్టు జడ్జి ఐ.ప్రవీణ్‌కుమార్ గురువారం ఒక్కొక్కరికీ మూడేళ్ల జైలుశిక్ష, రూ.10వేల చొప్పున జరిమానా విధించినట్లు అంగర ఎస్‌ఐ డి.రవికుమార్ తెలిపారు. ఆయనతెలిపిన వివరాలప్రకారం.. కపిలేశ్వరపురం గ్రామానికి చెందిన గరగపాటి సూర్యకుమారి ఇంట్లో లేనప్పుడు బంగారం వెండిఆభరణాలు చోరీచేశారు. దీనిపై బాధితురాలు సూర్యకుమారి 2023, జూలై 17న అంగర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్‌ఐ జి.చంటి కేసు నమోదు చేశారు. వాదోపవాదాల తర్వాత నేరం రుజువుకావడంతో నిందితులు కాజులూరుకు చెందిన షేక్ అజీజ్, రాజమహేంద్రవరానికి చెందిన యడ్లఉషాసూర్యవెంకట రాకేష్, తాతపూడికి చెందిన కాండ్రేగుల శ్రావణ కృష్ణ, ఇంద్రపాలేనికి చెందిన ముషినాడ గౌరీ మల్లేశ్వరిలకు జైలు శిక్ష విధించారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

అవగాహనా కార్యక్రమాలు అభినందనీయం

సామర్లకోట, జనవరి 9(ఆంధ్రజ్యోతి): పసి పిల్లలపై లేంగిక వేధింపులు నివారించే దిశగా పడాల ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వహిస్తున్న స్వేచ్ఛపర్ లిటిల్‌బర్డ్స్ అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ఎంపీడీవో కె.హిమమహేశ్వరి అన్నారు. ఎంఈవో శివరామకృష్ణయ్య అధ్యక్షతన గురువారం ఎంపీడీవో కార్యాలయంలో సదస్సు నిర్వహించారు.

హెచ్ఆర్ పాలసీ పూర్తిస్థాయిలో అమలు చేయాలి

కొత్తపల్లి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ఉద్యోగస్తులకు పూర్తిస్థాయిలో హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని కోరుతూ ఆ శాఖ ఉద్యోగులు డిమాండ్ చేశారు. పీఏసీఎస్ జిల్లా సహకార సంఘ ఉద్యోగుల ప్రధాన కార్యదర్శి సాదరబోయిన నరసరాజు ఆధ్వర్యంలో గురువారం కొమరగిరి, ఇసుకపల్లి, ఎండపల్లి, నాగులాపల్లిలో ఉన్న సహకార సంఘం కార్యాలయాలవద్ద ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన తెలిపారు.

కార్పొరేషన్‌లో అంతర్గత బదిలీలు

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 9(ఆంధ్రజ్యోతి): నగరపాలకసంస్థ పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా మున్సిపల్ కార్పొరేషన్‌లోని కొంతమంది సిబ్బందిని గురువారం బదిలీ చేశారు. రెవెన్యూ సెక్షన్‌లో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న కె.వరప్రసాదరావును పదోన్నతిపై సెక్రటరీ విభాగంలో సూపరిండెంట్‌గా నియమించారు. రెవెన్యూ విభాగం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్2 సీహెచ్ జాన్‌పాల్‌ను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్5గా బదిలీ చేశారు. యూపీఏ విభాగంలో సీనియర్ అసిస్టెంట్(హెచ్1) ఏబీఎస్ఎస్ ప్రసాద్‌ను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్2కి, హెచ్3 అసిస్టెంట్ డి.సాయిపావని యూపీఏ విభాగం తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు హెచ్1 అసిస్టెంట్ పోస్టుకి ఇన్‌చార్జిగా నియమించారు.

క్రీడాపోటీలు ప్రారంభం

పెద్దాపురం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మహారాణీ కళాశాలలో నిర్వహించిన సంప్రదాయ క్రీడాపోటీలను గురువారం డీఎస్పీ శ్రీహరిరాజు ప్రారంభించారు. పోటీలో విజేతలకు బహుమతులను అందచేశారు. కార్యక్రమంలో కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి, సీఐ క్రాంతికుమార్, ఎస్ఐ మౌనిక పాల్గొన్నారు.

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

పిఠాపురం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. శుక్రవారం నుంచి అన్ని పాఠశాలలకు సెలవులు కావడంతో గురువారమే ముందస్తుగా సంక్రాంతి వేడుకలను నిర్వహించారు. చిన్నారులు సంప్రదాయవేషధారణలో ఆకట్టుకున్నారు.పండుగ ముందే వచ్చిందా అన్నరీతిలో సంబరాలు జరిగాయి.

పిఠాపురం పట్టణంలోని భాష్యం స్కూలులో పల్లెటూరి వాతావరణంలో సంక్రాంతి పండుగను ఎలా జరుపుకుంటారో కళ్లకు కట్టినట్లు చూపారు. చిన్నారులు హరిదాసు, గోదాదేవి, శ్రీకృష్ణుడు వేషధారణలో అలరించారు. ఎడ్లబండిపై హల్‌చల్ చేశారు. బోగిమంట వద్ద సందడి చేశారు. బొమ్మల కొలువు, పిండివంటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బోగి, సంక్రాంతి, కనుమ పండుగల విశిష్టతను పాఠశాల ప్రిన్సిపాల్ పోలుపర్తి వేణు, ప్రైమరీ హెచ్ఎం అరుణ విద్యార్థులకు వివరించారు.

పట్టణంలోనిబైపాస్‌రోడ్డులోని శ్రీచైతన్య స్కూలులో సంక్రాంతి సంబరాలు జరిగాయి. చిన్నారులకు బోగిపండ్లు వేశారు. ప్రిన్సిపాల్ మంగేష్, ప్రీప్రైమరీ ఇన్‌చార్జి వరలక్ష్మి పాల్గొన్నారు.

గొల్లప్రోలులో..

గొల్లప్రోలు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు పట్టణం, మండలంలోని పాఠశాలల్లో సంక్రాంతి ముందస్తు సంబరాలు జరిగాయి. పట్టణంలోని మాధురి విద్యాలయలో జరిగిన సంక్రాంతి సంబరాల్లో విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, సంప్రదాయ వేషధారణలు అందరిని అలరించాయి. గొల్లప్రోలు ఎస్ఐ ఎన్.రామకృష్ణ, మాధురి విద్యాసంస్థల చైర్మన్ కడారి తమ్మయ్యనాయుడు, సీతాదేవి, ప్రిన్సిపాల్ మమత తదితరులు పాల్గొన్నారు.



పిఠాపురంలో ఎడ్లబండిపై విద్యార్థులు



కాకినాడలోని పాఠశాలలో టూటౌన్ సీఐ

ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో సంబరాలు

కాకినాడ క్రైం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సంబరాల్లో భాగంగా కాకినాడ ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ముగ్గుల పోటీలు, వివిధ సంప్రదాయ పోటీలు గురువారం ఘనంగా నిర్వహించారు. టూటౌన్ సీఐ మజ్జి అప్పలనాయుడు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముగ్గుల పోటీలను, సంప్రదాయ పద్ధతులను తిలకించి బాలికలు, యువతులు తయారు చేసిన తెలుగింటి సంప్రదాయ వంటకాలను రుచి చూశారు. స్కూల్ చైర్మన్ పి.శ్రీధర్ రెడ్డి, పీఆర్‌వో ధనుంజయరెడ్డి పాల్గొన్నారు.

పెద్దాపురప్పాడు హైస్కూల్‌లో...

కరప, జనవరి 9(ఆంధ్రజ్యోతి): పెద్దాపురప్పాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలను ఉత్సాహంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు సంప్రదాయ పద్ధతిలో వస్త్రాలంకరణ చేసుకుని సమష్టిగా వేడుకలను జరుపుకున్నారు. పాఠశాల ప్రాంగణంలో బోగిమంట వేసి తెలుగు పండుగలు, సంప్రదాయ విశిష్టతను వివరించారు. సర్పంచ్ బిరుదా సరస్వతి, ఉపసర్పంచ్ శ్రీనివాస అప్పారావు, ఎంపీటీసీ పబ్బినీడి పద్మావతి, బొండా సూర్యనారాయణ, హెచ్ఎం ఎస్ఎస్ శ్రీనివాస్, పీడీ బీవీవీఎస్‌వీ ప్రసాద్, ఎన్‌సీసీ ఉపాధ్యాయుడు తెలగాని వెంకట్రావు పాల్గొన్నారు.

బాలబాలికల ఆనందోత్సాహాల మధ్య...

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 9(ఆంధ్రజ్యోతి): తెలుగువారి అత్యంత ప్రీతిపాత్రమైన సంక్రాంతి పల్లెల్లో కూడా కనుమరుగవుతున్న కాలంలో న్యూ సెంచరీ స్కూల్‌లో తమ విద్యార్థులకు సంక్రాంతి అంటే ఏంటో తెలియజెప్పేలా సంక్రాంతి గంగిరెద్దులు హరిదాసు కీర్తనలు, బొమ్మల కొలువు, గాలిపటాలు వంటి ప్రత్యేకలతో పండుగను పిల్లలకు వాటి ప్రత్యేకతల గురించి తెలిపారు. భోగి మంటలు వేసి ముగ్గులు వేశారు. స్కూల్ కరస్పాండెంట్ ఎం.రామలక్ష్మి వెంకట్, డాక్టర్ అడబాల అనుపమ, ప్రిన్సిపాల్ ఎస్.నిహారిక, సిబ్బంది పాల్గొన్నారు.

సంప్రదాయ పద్ధతిలో బోగిపిడకలు

గొల్లప్రోలు రూరల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం దుర్గాడలో మహిళలు సంప్రదాయ పద్ధతిలో బోగి పిడకలు తయారు చేశారు. గ్రామంలోని గోగాయత్రి ప్రకృతి వ్యవసాయ వనరుల తయారీ, శిక్షణా కేంద్రంలో మహిళలు పదివేల పిడకలను సిద్ధం చేశారు.

ముక్కోటి ఏకాదశికి ఆలయాల ముస్తాబు

పిఠాపురం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ముక్కోటి(వైకుంఠ) ఏకాదశి పర్వదినానికి పిఠాపురం పట్టణంలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. శుక్రవారం తెల్లవారుజాము నుంచే ఆలయాల్లో ఉత్తరద్వార దర్శనానికి ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉండడంతో సులభరీతిలో దర్శనమయ్యేలా చర్యలు చేపట్టారు. దేశంలోని పంచమాధవక్షేత్రాల్లో ఒక్కటైన పిఠాపురం పట్టణంలోని కుంతీ మాధవస్వామి దేవస్థానంలో శుక్రవారం తెల్లవారుజామున ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరగనున్నాయి. స్వామి, అమ్మవార్లకు ఆళ్వార్ల సమక్షంలో కళ్యాణ మండపంలో వార్షిక అధ్యయనోత్సవాలు ప్రారంభిస్తారు. తెల్లవారుజామున 4గంటల నుంచి వైకుంఠ(ఉత్తర) ద్వార దర్శనం ప్రారంభమవుతుంది. స్వామి తిరువీధి గ్రామోత్సవం నిర్వహిస్తారు. ఉత్తరద్వార దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ ఈవో నున్న శ్రీరాములు తెలిపారు.

పట్టణంలోని రుక్మిణి సత్యభామసమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా విశేషపూజలు నిర్వహించనున్నారు. మంగళవారం సహస్ర గులాబి అర్చన జరుగుతుంది. టీటీడీ నిర్వహణలో తహసీల్దారు కార్యాలయ సమీపంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలోను ముక్కోటి ఏకాదశి సందర్భంగా పూజలు జరగనున్నాయి.

గొల్లప్రోలులో..

గొల్లప్రోలు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు పట్టణం, మండలంలోని ఆలయాల్లో ముక్కోటి ఏకదాశి సందర్భంగా శుక్రవారం విశేష పూజలు నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. విష్ణాలయం(సీతారామస్వామి దేవస్థానం)లో ఉత్తర ద్వార దర్శనం జరుగుతుంది.



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఆర్‌జేసీ సుబ్బారావు

భావనారాయణస్వామిని దర్శించుకున్న ఆర్‌జేసీ

సర్పవరంజంక్షన్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): దేశంలోని 108 వైష్ణవ దేవాలయాల్లో ఒకటిగా ప్రఖ్యాతిగాంచిన శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామి ఆలయంలో శుక్రవారం ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా ఉత్తర ద్వార దర్శనానికి దేవదాయ, ధర్మదాయశాఖ ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. సర్పవరంలో శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామిని ముక్కోటి ఏకాదశి పర్వదినాన ఉత్తర ద్వారం గుండా దర్శించుకునేందుకు వీలుగా ఉదయం 5 గంటలనుంచి భక్తులకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. స్వామిని దర్శించుకునేందుకు ఉచిత దర్శనంతోపాటు రూ.30, రూ.100 దర్శనానికి ప్రత్యేక బారికేడ్లు ఏర్పాటు చేశామన్నారు. గురువారం ఆర్‌జేసీ కె.సుబ్బారావు, డీసీ డీఎల్‌వీ రమేష్‌బాబు పర్యవేక్షించారు. భావనారాయణస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు.

సకాలంలో చెత్త సేకరణ పూర్తి చేయాలి: కమిషనర్



తెల్లవారుజామున పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న కమిషనర్

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 9(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య నిర్వహణ విషయంలో ప్రత్యేక చర్యలు చేపట్టాలని సకాలంలో చెత్త సేకరణ పూర్తి చేయాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన సూచించారు. పారిశుధ్య తనిఖీల్లో భాగంగా గురువారం తెల్లవారుజామునే తీవ్రమైన మంచులో కమిషనర్ భావన పర్యటించారు. నగరంలోని గాంధీనగర్ ప్రాంతంలోని గాంధీపార్కు, రైతుబజార్, సుబ్బయ్యహోటల్ రోడ్డు తదితర ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వాహనను పరిశీలించారు. ఇంటింటా చెత్త సేకరణ తీరును గమనించారు. ప్రజలు కూడా కాకినాడ నగరాన్ని క్లీన్ సిటీగా ఉంచేందుకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్, ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.

'తిరుపతి ఘటనలో భక్తుల మృతి బాధాకరం'

కాకినాడ సిటీ, జనవరి 9(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ద్వార దర్శనం కోసం తిరుపతిలో టోకెన్ల జారీ కౌంటర్ల వద్ద తొక్కిసలాట జరగడం బాధాకరమని జనసేన నాయకుడు, మల్లాడి రామారావు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మల్లాడి రాజేంద్రప్రసాద్ విచారం వ్యక్తం చేశారు. అకస్మాత్తుగా జరిగిన ఈదుర్ఘటనలో ఆరుగురు భక్తులు మృతి చెందడం, పలువురు భక్తులు గాయపడడం దురదృష్టకరమన్నారు. బాధిత కుటుంబలకు సానుభూతి వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలందించాలని మల్లాడి కోరారు.

రాఘవమ్మ సేవలు చిరస్మరణీయం

కాకినాడ సిటీ, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సీపీఎం మహిళా నేత రాఘవమ్మ అందించిన సేవలు చిరస్మరణీయమని సీపీఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు అన్నారు. స్థానిక సుందరయ్య భవన్‌లో సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మహిళానేత కుడుపూడి రాఘవమ్మ సంతాప సభ గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా సీనియర్ నేత దువ్వా శేషబాబ్జి అధ్యక్షత వహించగా నాయకులు సీహెచ్ రాజ్‌కుమార్, పలివెల వీరబాబు, కె.సత్తిరాజు, మలక వెంకటరమణ, సీహెచ్ అజయ్‌కుమార్, టి.రాజా పాల్గొన్నారు.

పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా సతీష్‌బాబు

కాకినాడ సిటీ, జనవరి 9(ఆంధ్రజ్యోతి): పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా కాకినాడ జిల్లాకు చెందిన రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు నియమితులయ్యారు. ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ నిర్ణయం మేరకు పర్సనల్, పబ్లిక్ గ్రీవెన్స్, లా అండ్ ఆర్డర్ జస్టిస్ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా సతీష్‌బాబును నియమించారు. టీడీపీ తరపున ఆయన ఇటీవల రాజ్యసభ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే. ఆయన నియామకం పట్ల కాకినాడలోని క్యాంపు కార్యాలయం వద్ద పార్టీ శ్రేణులు స్వీట్లు పంచారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి జైలు

కాకినాడ క్రైం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన 27 మందికి కాకినాడ మూడవ స్పెషల్ జ్యూడిషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వి.నరసింహారావు జైలు, జరిమానా విధిస్తూ గురువారం తీర్పుచెపారు. కాకినాడట్రాఫిక్ సీఐలు ఎన్.రమేష్ డి.రామారావు బృందాలతో బుధవారం రాత్రి డ్రంకన్ డ్రైవ్ నిర్వహిస్తుండగా మోతాదు దాటి మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిని బ్రీత్ ఎనలైజర్లతో పరిక్షించగా 27మంది పట్టుబడ్డారు. కోర్టులో హాజరుపర్చగా 14మందికి ఒక్కొక్కరికి రెండు రోజుల చొప్పున జైలు శిక్ష, మరో 13మందికి ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానా విధించినట్లు సిఐ రమేష్ తెలిపారు.

శ్మశానవాటిక స్థలాన్ని పరిరక్షించాలని ఎమ్మార్పీఎస్ ధర్నా

గొల్లప్రోలు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): శ్మశానవాటిక స్థలాన్ని పరిరక్షించాలని, అక్కడ వేసిన చెత్తను తొలగించి డంపింగ్‌యార్డుకు తరలించాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో గొల్లప్రోలులో గురువారం భారీ ఆందోళన నిర్వహించారు. ప్రధాన రహదారులపై ప్రదర్శన జరిపారు. అనంతరం తహశీల్దారు కార్యాలయం వద్ద రోడ్డుపై బైఠాయించి ధర్నాకు దిగారు. శ్మశానవాటిక స్థలాన్ని డంపింగ్‌యార్డుగా మార్చడం దారుణమని, నగరపంచాయతీ అధికారులు తీరు సరిగా లేదని ఎమ్మార్పీఎస్ సంఘాల నేతలు తెలిపారు. తమ శ్మశాన స్థలాన్ని చెత్తాచెదారంతో నింపడంతో అంతిమ సంస్కారాలు ఎక్కడ చేసుకోవాలని వారు ప్రశ్నించారు. తమ శ్మశానవాటిక స్థలాన్ని పరిరక్షించుకునేందుకే శాంతియుతంగా ఆందోళన చేపట్టామని తెలిపారు. శ్మశానంలో ఉన్న చెత్తాచెదారాన్ని పూర్తిగా తొలగించి దానిని అభివృద్ధి చేయాలని వారు డిమాండ్ చేశారు. డిమాండ్లపై అధికారుల్లో స్పందన కరువైందని తెలిపారు. డిమాండ్లు నెరవేర్చకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రహదారిపై గడ్డి బొమ్మను ఉంచి మృతదేహాలకు అంతిమసంస్కారాలు ఎక్కడ చేయాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఆందోళనలో ఎమ్మార్పీఎస్, ఎంపీఎస్ ప్రతినిధులు కాకాడ నూకరాజు, పిల్లి బలరాముడు, దూలపల్లి వెంకటరమణ, తాతపూడి సత్యనారాయణ, దేవరపు సురేష్, నేకూరి ప్రసాద్, తాతపూడి సాల్మన్‌రాజు, ఎం.డేవిడ్ రాజు, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గొల్లప్రోలు తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా, రాస్తారోకో నిర్వహిస్తున్న దళిత సంఘాల ప్రతినిధులు

కళ్లజోళ్లు, దుస్తులు పంపిణీ

కాకినాడరూరల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): కాకినాడ లయన్స్ క్లబ్ హాల్లో రెడ్ కాన్వెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 90మంది నిరుపేదలకు ఉచితంగా కళ్లజోళ్లు, బట్టలను రిటైర్డు ఎస్‌బీఐ చీఫ్ అసోసియేట్ టి.వెంకటలక్ష్మి విద్యార్థులకు అందజేశారు. ట్రస్ట్ అధ్యక్షులు డాక్టర్ బాదం బాలకృష్ణ మాట్లాడుతూ ఏటా ట్రస్ట్ ద్వారా 1500 మంది పేదలకు కళ్లజోళ్లు, 28మంది విద్యార్థులకు రూ.6లక్షల స్కాలర్‌షిప్‌లను రెడ్‌కాన్వెంట్ పూర్వపు విద్యార్థులు అందిస్తుండడం గర్వంగా ఉందన్నారు. ఇంటర్ చదువుతున్న సీహెచ్ రేష్మకు. 15వేలు స్కాలర్‌షిప్‌ను అందించారు.

సర్వీస్ ప్రొవైడర్స్ నమోదు కార్యక్రమం ప్రారంభం



మాట్లాడుతున్న మెప్మా పీడీ ప్రియంవద

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 9(ఆంధ్రజ్యోతి): సేవారంగంలో నైపుణ్యాన్ని మెరుగుపరచుకుని ఉపాధి అవకాశాలను పెంచుకుంటూ ఆర్థికంగా ఎదగాలని మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ బి.ప్రియంవద ఔత్సాహిక వృత్తిదారులకు సూచించారు. కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా సర్వీస్ ప్రొవైడర్స్ నమోదు కార్యక్రమం ఫేస్-1ను గురువారం భానుగుడి పాత మీసేవా సెంటర్‌లో నిర్వహించారు. వృత్తిదారుల రిజిస్ట్రేషన్ నమోదు కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ బి.ప్రియంవద, టౌన్ ప్రాజెక్టు ఆఫీసర్ కె.శైలజ పాల్గొని అవగాహనకల్పించారు. ఈసందర్భంగా బి.ప్రియంవద మాట్లాడుతూ వడ్రంగి సేవలు, ప్లంబింగ్ సేవలు, కార్పెంటర్, గృహోపకరణాల రిపేరింగ్, బ్యూటీషియన్ తదితర వృత్తుల్లో వారికి ప్రత్యేకంగా రూపొందించిన హోట్ ట్రియాంగి యాప్ ద్వారా ప్రత్యక్షంగా సేవలందిచనున్నామని తెలిపారు. సిటీ మేనేజర్ డి.వెంకట్రాజు, సీఓలు, ఆర్‌పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

70 మందిపై బైండోవర్ కేసులు

సర్పవరం జంక్షన్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ పేరుతో కోడిపందేలు, గుండాట నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని, కత్తులు కట్టే 70 మందిపై ముందస్తుగా బైండోవర్ చేసినట్లు తిమ్మాపురం పోలీస్‌స్టేషన్ ఎస్ఐ ఎంవీవీ రవీంద్రబాబు తెలిపారు. గురువారం తిమ్మాపురం, పండూరు, సూర్యారావుపేట, నేమాం తదితర గ్రామాల్లో సిబ్బందితో కలసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగలో సంప్రదాయ క్రీడలను జరుపుకోవాలని, ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు యువత కోసం వాలీబాల్, కబడ్డీ వంటి సంప్రదాయ క్రీడలను నిర్వహిస్తున్నామన్నారు. కోడిపందేలు, జూదం, గుండాట, అశ్లీల ప్రదర్శనలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలంతా ఆనందోత్సాహాలతో సంక్రాంతి పండుగ జరుపుకోవాలన్నారు. తిమ్మాపురం స్టేషన్ పరిధిలో ఇప్పటి వరకు 18కేసుల్లో 70మందిపై బైండోవర్ చేసినట్లు తెలిపారు.

ఆన్‌లైన్‌లో లైఫ్ సర్టిఫికెట్స్ జారీ అభినందనీయం



మాట్లాడుతున్న సీనియర్స్ సిటిజన్ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరాజు

సర్పవరం జంక్షన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రిటైర్డు ఉద్యోగుల సౌకర్యార్థం ఆన్‌లైన్‌లో లైఫ్ సర్టిఫికెట్ కార్యక్రమాన్ని అడబాల ట్రస్ట్ చేపట్టడం అభినందనీయమని సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షుడు బి.సత్యనారాయణరాజు అన్నారు. గురువారం రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్, ఆల్ ఈజ్ వెల్ సంస్థల ఆధ్వర్యంలో రిటైర్డు ఉద్యోగులకు లైఫ్ సర్టిఫికెట్ల ఆన్‌లైన్ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ప్రతీ ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగి తప్పనిసరిగా ఏటా ఒకసారి లైఫ్ సర్టిఫికెట్ ట్రెజరీకి అందజేయాల్సి ఉంటుందన్నారు. నడవలేని స్థితిలో ఉన్న వారు 9966198404 ఫోన్ చేస్తే ఇంటి వద్దకే వచ్చి ఉచితంగా తీయడం జరుగుతుందన్నారు. ట్రస్ట్ అధ్యక్షుడు రత్నప్రసాదరావు, ప్రసాద్‌నాయుడు, సుబ్బారావు, ఆర్ బాపిరాజు, ఎం.వెంకట్రావు, రామ్మూర్తి పాల్గొన్నారు.

సొసైటీ ఉద్యోగుల ఆందోళన



పిఠాపురం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలోని అగ్రహారం సొసైటీ వద్ద ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి ఆందోళన నిర్వహించారు. వేతన సవరణ చేయాలని, జీతాలు పెంచాలని, జీవో 36 అమలుచేసి హెచ్ఆర్ పాలసీ వర్తింప చేయాలని వారు నినాదాలు చేశారు. ఆందోళనలో భాగంగా కంప్యూటర్ వర్క్స్ అన్ని నిలిపివేసి నిరసన తెలిపారు.

తిరుపతి స్విమ్స్, పద్మావతి ఆసుపత్రిలో క్షతగాత్రులకు ఎమ్మెల్యే నానాజీ పరామర్శ



బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పంతం నానాజీ

సర్పవరం జంక్షన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో జరిగిన తొక్కిసలాటలో ప్రాణాలతో బయటపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతోన్న క్షతగాత్రులను కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పరామర్శించారు. గురువారం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు తిరుపతిలో స్విమ్స్, పద్మావతి మహిళా వైద్య కళాశాలల్లో చికిత్స పొందుతోన్న క్షతగాత్రులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఈసందర్భంగా వీరికి అందుతోన్న వైద్య సేవలు గురించి డాక్టర్లను అడిగి తెలుసుకుని, మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని, క్షతగాత్రులకు అండగా ఉంటామని భరోసా కల్పించారు.

మౌలిక వసతులు కల్పించాలి

పెద్దాపురం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో పిల్లి రమేష్ అన్నారు. స్థానిక శ్రీప్రకాష్ సినర్జీస్ పాఠశాలో డివిజన్ పరిధిలో 11మండలాల ఎంఈవోలు, హెచ్ఎంలతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్కూల్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా ఆయన సమావేశం నిర్వహించారు. ఎస్ఎస్‌సీ యాక్షన్ ప్లాన్, ఏపీఏఏఆర్ స్టేటస్, ఎస్ఏ ఎగ్జామ్ ఫలితాలపై టీచర్ ఇన్‌ఫర్మేషన్ స్టడీస్, పీఎంశ్రీ తదితర విషయాలపై సమీక్షించారు. సమగ్ర శిక్షా ఏపీసీ పి.వేణుగోపాల్, డీవైఈవో ప్రభాకరశర్మ, డీసీఈబీ కార్యదర్శి వెంట్రావు, డీఈ నాగేంద్ర, ఎంఈవో చౌదరి పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలిచ్చి సీఎం మాట నిలబెట్టుకోవాలి

• సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు
• తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా



కాకినాడలో ధర్నా చేస్తున్న దృశ్యం

కాకినాడ సిటీ, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి సీఎం చంద్రబాబు మాట నిలబెట్టుకోవాలని సీపీఐరాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఇళ్ల స్థలాల హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ కాకినాడ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక అర్బన్ తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి ఇళ్ల స్థలాల కోసం అర్జీలు సమర్పించారు. ఈసందర్భంగా మధు మాట్లాడుతూ ఇల్లు లేని నిరుపేదలకు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు స్థలాలిచ్చి ఇళ్ల నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేయాలన్నారు. గత ప్రభుత్వంలో జగన్ ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో పట్టణ ప్రాంతవాసులకు సెంటుకు బదులు రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతవాసులకు సెంటున్నరకు బదులు మూడు సెంట్లు ఇస్తామన్న ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ నెరవేర్చాలన్నారు. దీనిపై వచ్చే నెలలో కలెక్టరేట్ల వద్ద ధర్నాలు చేపడతామని, అప్పటికి ప్రభుత్వం దిగిరాకపోతే ఇళ్ల స్థలాల సాధన సమితి ఏర్పాటుచేసి పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు. సీపీఐ కాకినాడ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ, జిల్లా సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, వివిధ సంఘాల నాయకులు ఎంఎస్ నారాయణ, రాజువర్ధన్ పాల్గొన్నారు.

రేపు హిందూ ఉపాధ్యాయ సమితి జాతీయ మహాసభ



మహాసభల వివరాలు వెల్లడిస్తున్న సమితి నాయకులు

పిఠాపురం, జనవరి9(ఆంధ్రజ్యోతి): హిందూ ఉపాధ్యాయ సమితి జాతీయ పంచమ మహాసభ పిఠాపురం పట్టణంలోని అగ్రహారంలో గల అనఘా దత్త క్షేత్ర ఆడిటోరియంలో జనవరి 11న జరగనున్నది. ఇందుకు సంబంధించిన వివరాలను పిఠాపురంలోని ఆర్ఆర్‌పార్కులో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన సమావేశంలో సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డేరా రాజబాబు, కోనసీమ జిల్లా అధ్యక్షుడు అంజిబాబు, రాజమహేంద్రవరం కార్యదర్శి సత్యనారాయణమూర్తిలు వెల్లడించారు. ఉభయ తెలుగురాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్నాటక, యానాం(పాండిచ్చేరి) తదితర రాష్ట్రాలు నుంచి ప్రతినిధులు ఈమహాసభలకు హాజరవుతారని తెలిపారు. ఈసభల్లోనే జాతీయ, రాష్ట్ర, జిల్లా కార్యవర్గాల ఎన్నిక జరుగుతుందని చెప్పారు. కమలానంద భారతిస్వామి ఆశీస్సులతో నిర్వహించే సభల్లో ఆంధ్రప్రదేశ్ సాధుపరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద భారతిస్వామి, మైసూరుకు చెందిన వేదపండితుడు క్రతి సంతోష్‌కుమార్ ఘనాపాఠి, హిందూ ధర్మా రక్ష సమితి అధ్యక్షుడు చెదులూరి గవరయ్య, ఆంధ్ర, తెలంగాణ శివశక్తి ప్రతినిధి చాట్లపల్లి కల్యాణ్ కుమార్, సీనియర్ న్యాయవాది వజ్రాల చంద్రశేఖర్, ఉపాధ్యాయ సమితి జాతీయ అధ్యక్షుడు డేగల మహేష్ పాల్గొంటారని వారు వివరించారు. ఈసభల్లో హైందవ ఉపాధ్యాయులందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

రేపు సోషల్ ఆడిట్ సమావేశం

ప్రత్తిపాడు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండల స్థాయి ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్ ప్రజావేదిక సమావేశం ఈ నెల 11న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబు తెలిపారు. 1.4.2023 నుంచి 31.3.2024 వరకు మండలగ్రామాల్లోనిర్వహించిన ఉపాధి పనులపై 16వ సామాజిక తనిఖీ సభ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు. మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో ఉపాధి పనుల తనిఖీలు ఇప్పటికే నిర్వహించినట్లు ఎంపీడీవో తెలిపారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

నిర్వాసితులకు న్యాయం చేయడమే ప్రభుత్వ ధ్యేయం

● పీవో, సబ్ కలెక్టర్



సమస్యలు వింటున్న పీవో సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ

దేవీపట్నం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): పోలవరం నిర్వాసితులకు పూర్తిస్థాయిలో న్యాయం చేసే విధంగా ప్రభుత్వం దృష్టిసారించిందని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, సబ్‌కలెక్టర్ కల్పశ్రీ అన్నారు. గురువారం మండలంలో తహసీల్దార్ కార్యాలయంవద్ద పోలవరం నిర్వాసితులకు సమావేశం నిర్వహించారు. ముందుగా వారు మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతీఒక్కరికీ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అందుతుందని నిర్వాసితులు ఎవరూ అధైర్యపడవద్దన్నారు. పోలవరం ముంపునకు గురైన 44 గ్రామాల నుంచి భూమికి భూమి, ఆర్‌అండ్‌ఆర్, సొంతంగా ఇళ్లు నిర్మించుకునే వారికి ఇటీవల వారి అకౌంట్లలో సొమ్ము జమైందన్నారు. నిర్వాసితులు సమస్యలు కోసం ప్రభుత్వ కార్యాలయానికి వస్తున్నారని వారి సమస్యలు నేరుగా ఇక్కడే తెలుసుకునేందుకు సమావేశం నిర్వహించామన్నారు. దేవీపట్నం గ్రామానికి సంబంధించి గోకవరంలో నిర్మిస్తున్న ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఎనిమిది ఎకరాల 30సెంట్లు భూమిని కొంతమంది నిర్వాసితులకు పట్టాలిచ్చారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి గ్రామస్తులు గేదెల పెద్దసుబ్బారావు, సిద్దా నారాయణస్వామి, దొడ్డా సింహాద్రి, గేదల చినసుబ్బారావు తీసుకెళ్లారు. 44 గ్రామాల నిర్వాసితుల వద్ద పలు సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఎంపీడీవో రత్నకుమారి, రెవెన్యూ, భూసేకరణ, తదితర శాఖాధికారులు పాల్గొన్నారు.

సమగ్ర పునరావాసం కల్పించాలి

పోలవరం నిర్వాసితులకు సమగ్ర పునరావాసం కల్పించాలని కోరుతూ గురువారం దేవీపట్నం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన సబ్‌కలెక్టర్ కల్పశ్రీకి ఆదివాసీ జేఏసీ నాయకులు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్‌చైర్మన్ తెల్లం శేఖర్ మాట్లాడుతూ నిర్వాసితులందరికీ నష్టపరిహారం చెల్లించాలని, భూమికి భూమి ఇప్పించాలని, వ్యవసాయానికి సాగుకి యోగ్యమైన భూమి ఇప్పించాలని తదితర డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు కారం రామన్నదొర, యలగాడ నాగేశ్వరరావు, కుంజం భద్రం, బొరగ నాగరాజు, తుర్రం చంద్రరావు, తాటి వెంకన్నదొర, రాంబాబుదొర, దుర్గాప్రసాద్, దుర్గారెడ్డి పాల్గొన్నారు.

ఆయాల భర్తీకి ఇంటర్వ్యూలు

రంపచోడవరం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఏజెన్సీలోని 5 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలోని ఖాళీగా ఉన్న అంగన్వాడీ కేంద్రాలలో ఆయాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించినట్టు సబ్ కలెక్టర్ కె.ఆర్.కల్పశ్రీ తెలిపారు. మొత్తం 39 ఆయాలకుగాను 75మంది దరఖాస్తు చేసుకున్నారని, నిబంధనల ప్రకారం 39మంది ఆయాలను ఎంపిక చేసినట్టు ఆమె తెలిపారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సూర్యకుమారి, ఏడీఎంహెచ్‌వో జి.శిరీష, సీడీపీవోలు సంధ్యారాణి, లక్ష్మిప్రసన్న, దేవమణి పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు



అడ్డతీగలలో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్న విద్యార్థులు

చింతూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం సంక్రాంతి సంబరాలు కార్యక్రమం నిర్వహించారు. ముగ్గుల పోటీలలో పాల్గొన్న విద్యార్థినిలు పాఠశాల ప్రాంగణమంతా ముగ్గులతో అలంకరించారు. తదుపరి బోగి మంట వేసి పాటలు పాడారు. ప్రధానోపాధ్యాయుడు బాలకృష్ణ, ఉపాధ్యాయులు స్వాతి, రమేష్, పెంటమ్మ, నాగరాజు, సుబ్బయ్య పాల్గొన్నారు.

అడ్డతీగల: అడ్డతీగల మండలం వేటమామిడి హోసన్న హైస్కూల్‌లో గురువారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పిట్టలదొర కవిత్వాలు ఆకర్షించాయి.

మోతుగూడెం: మోతుగూడెంలో గురువారం డీఏవీ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. డీఏవీ పాఠశాల ఎల్ఎంసీ చైర్మన్, సీలేరు కాంప్లెక్స్ ఇన్‌చార్జ్ వాసుదేవరావు సంక్రాంతి విశిష్టతను వివరించారు. విద్యార్థులకు ముగ్గులు పోటీలు నిర్వహించి విజేతలకుబహుమతులు అందజేశారు. అనంతరం నృత్యం, సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సూపరింటెండెంట్ ఇంజనీర్ చిన్న కామేశ్వరరావు, ప్లాంట్ మేనేజర్ చిన్న కామేశ్వరరావు, ప్లాంట్ మేనేజర్ భీమవరపు బాలకృష్ణ, ప్రధానఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

వై.రామవరం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలో జన్‌మన్ పథకం ద్వారా మంజూరైన గృహ నిర్మాణాలను లబ్ధిదారులకు పూర్తిగా కట్టించే వరకు హౌసింగ్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేదరికంలో ఉన్న గిరిజనులు ఇళ్లు కట్టుకోలేని పరిస్థితి ఇక్కడ నెలకొందని సరైన కాంట్రాక్టర్ల ద్వారా ఇళ్లు కట్టించి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలంటూ ఎంపీపీ ఆనందరావు, ఎంపీటీసీ కరకా వెంకటరమణ అధికారులను కోరారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రవి కిషోర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ అధ్యక్షత వహించారు. లోతట్టు గ్రామాల్లో తాటాకు పాకల్లోనే కొన్ని పాఠశాలలు నిర్వహిస్తున్నారని వాటికి భవనాలు నిర్మాణాలకై ప్రతిపాదనలు పంపించాలని సభ్యులు కోరారు. పుట్టగండి గ్రామంలోని ఓ పాఠశాలలో ఉపాధ్యాయుడు విధుల్లో సక్రమంగా కనిపించడని అతనిపై చర్యలు తీసుకోవాలని ఎంఈవోకు ఎంపీపీ సూచించారు. మండల ఎగువ ప్రాంతాల్లోని అంగన్‌వాడీ హెల్పర్లకు సంబంధించి పది పోస్టులకు దారగడ్డ పంచాయతీలోని మూడు గ్రామాల నుంచి అర్హులు కనిపించలేదని సీడీపీవో ప్రసన్న తెలపగా ప్రస్తుతం ఉన్న అర్హతతోనే ఆయా గ్రామాల్లో పోస్టులు భర్తీ చేయాలని సభ్యులు కోరారు. సుదూర ప్రాంతాల నుంచి ప్రజా సమస్యలతో తాను సమావేశాలకు హాజరవుతుంటే కొన్ని శాఖల అధికారులు సమావేశాలకు రావడంలేదని అలాంటి వారికి షోకాజ్ నోటీసులు అందించాలని ఎంపీటీసీ వెంకటరమణ, ఎంపీడీవోకు సూచించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు విశ్వమ్మ, జోగిరెడ్డి, తహసీల్దార్ వేణుగోపాల్, పలు శాఖలాధికారులు పాల్గొన్నారు.

న్యూట్రీ గార్డెన్లు ఉండాలి

చింతూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రతి అంగన్వాడీ సెంటర్‌లో న్యూట్రీ గార్డెన్లు ఉండేలా చొరవ తీసుకోవాలని స్త్రీశిశు సంక్షేమశాఖ రీజినల్ జాయింట్ అధికారిణి (విశాఖపట్నం) జీ చిన్మయిదేవి సూచించారు. గురువారం చింతూరు మండలం, చట్టి సెక్టార్ పరిధిలో గల చట్టి -2 అంగన్వాడీ కేంద్రాన్ని జీ చిన్మయిదేవి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె అంగన్వాడీలకు పలు సూచనలిచ్చారు. క్రమం తప్పకుండా రిజిష్టర్లు మెయింటెనెన్స్ చేయాలని, చిన్నారుల గ్రోత్‌లను ఎప్పటికప్పుడు రిజిష్టర్లలో పొందుపర్చాలన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి పి.విజయగౌరి, సెక్టార్ పర్యవేక్షణ అధికారులున్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు



ప్రత్తిపాడు మినర్వాలో చిన్నారులకు భోగి పండ్లు వేస్తున్న దృశ్యం



తొండంగి: పాఠశాలల్లో విద్యార్థులు వేసిన ముగ్గులు

అంబరాన్నంటేలా సంక్రాంతి సంబరాలు

తునిరూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అక్షరా పబ్లిక్ స్కూల్లో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటేలా నిర్వహించారు. అలయన్స్ క్లబ్ అధ్యక్షుడు కోరుకొండ సత్యనారాయణ మాట్లాడుతూ సాంస్కృతి సాంప్రదాయాలను పరిరక్షించుకుని భావితరాలకు అప్పగించడం ప్రతిఒక్క పౌరుడి బాధ్యత అన్నారు. అనంతరం చిన్నారులు ఆటపాటలు, గొబ్బెమ్మలు వివిధ వేషధారణతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో అలయన్స్ డైరెక్టర్ పరవాడ తాతబాబును క్లబ్ సభ్యులతో పాటుగా స్కూల్ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

ఏలేశ్వరం: ముందస్తు సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఏర్పాటుచేసిన రంగవల్లులు, మ్యూజికల్ చైర్స్, హరిదాసు, గంగిరెద్దు వేషధారణలు, గొబ్బెమ్మల, భోగి మం టలుతో స్థానిక ప్రభుత్వ పాఠశాల, ఏలేశ్వరం పబ్లిక్ స్కూల్, శ్రీసత్యనారాయణ పాఠశాలల ఆవరణలో ఉపాధ్యాయులు, విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి వైభవంగా సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. కరస్పాండెంట్ డీవీవీ సత్యనారాయణ, పైల రాణా ప్రతాప్, కౌన్సిలర్లు సుంకర హైమావతి, సామంతుల సూర్యకుమార్, కర్రోతు గాంధీ, కటకం సూర్యకుమారి ఉన్నారు.

అంగన్వాడీ కేంద్రాల్లో..

జగ్గంపేట: జగ్గంపేటలోని పలు అంగన్వాడీ కేంద్రాల్లో వైభవంగా సంక్రాంతి సంబరాలు జరుపుకున్నట్టు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారిణి పూర్ణిమ మీడియాకు తెలిపారు. గురువారం జగ్గంపేట ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పలు అంగన్వాడీ కేంద్రాల్లో ప్రాజెక్టు అధికారిని పూర్ణిమ అధ్యక్షతన సంక్రాంతి సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ సంక్రాంతి సంబరాలు తీపి గుర్తులను గుర్తు చేశాయన్నారు. జగ్గంపేటలో ఉన్న ఐదు అంగన్వాడీ కేంద్రాల్లో జరిపిన పోటీలలో గెలిచిన పలువురికి మణికర్ణిక యువజన సంఘం ఏర్పాటుచేసిన ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు మండల రెవెన్యూ అధికారి జేవీఆర్ రమేష్, మండల అభివృద్ధి అధికారి అడపా చంద్రశేఖర్, ఏపీఎం బి.ప్రశాంతి, ఈవో వీఆర్డీలు అందజేశారు. అలాగే రావులమ్మనగర్‌లోని భాష్యం స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో పచ్చని కొమ్మలతో, తోరణాలతో, ముగ్గులతో అలంకరించారు. చిన్నారులు ఆటపాటలు, నృత్యాలతో అలరించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ముగ్గులపోటీలు నిర్వహించి బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కుసిరెడ్డి సత్యనారాయణ, చైర్మన్ రామకృష్ణ, జోనల్ ఇన్‌చార్జ్ గోవిందరాజు, ప్రైమరీ ప్రిన్సిపాల్ వాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తొండంగి: మండలంలోని పాఠశాలల్లో గురువారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. పెరుమాళ్ళపురం ఉన్నతపాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు రంగవల్లులు తీర్చిదిద్ది సంప్రదాయ వస్త్రధారణతో వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయులు ఛాత్రాతి వీవీ సత్యన్నారాయణ ఆధ్వర్యంలో పతంగుల పోటీలు నిర్వహించారు. పాఠశాలలో పనిచేసే ఆయాలకు పాఠశాల ఉపాధ్యాయురాలు గంగయమ్మ నూతన వస్త్రాలు అందించారు. భోగి మంటవేసి సంక్రాంతి విశిష్టతను విద్యార్థులకు తెలిపారు. బెండపూడి ఉన్నత పాఠశాలతోపాటు మండలంలోని అనేక పాఠశాలల్లో భోగి మంటలు వేసి రంగవల్లులతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు మినర్వా ప్రాంగణంలోగురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులచే సాంస్కృతిక ప్రదర్శనలు, సోదమ్మ, కొమ్మదాసు, హరిదాసువేషధారణలో చిన్నారులు అలరించారు. విద్యార్థులు చేసిన కరాటే విన్యాసాలు ఆకట్టుకున్నాయి. చిన్నారులకు ఉపాధ్యాయులు భోగి పళ్ళు వేశారు. విద్యార్థులకుముగ్గులపోటీలు నిర్వహించారు. విజేతలకు మినర్వా ఫౌండర్ రమేష్‌రాజు, చైర్మన్ మురళీకృష్ణ, హెచ్ఎం మల్లికార్జునరావు, లక్ష్మణకుమార్, పీఈటీ రవి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



జగ్గంపేటలో ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్న దృశ్యం



ఏలేశ్వరం పాఠశాలలో సంప్రదాయ దుస్తులతో విద్యార్థులు

సంక్రాంతి సంబరాలు

రౌతులపూడి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): శంఖవరం మండంలోని శ్రీసత్యభారతి స్కూల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో అలరించారు. బోగి మంటలు వేశారు. నృత్యాలతో ఆకట్టుకున్నారు.

ప్రగతిలో రెండోరోజు స్ట్రైడ్స్ 2025

గండేపల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో స్ట్రైడ్స్ 2025లో భాగంగా రెండో రోజు ఈఈఈ విభాగం వారి ఎక్సల్ట్ 2025కు ప్రొఫెసర్ ఆఫ్ ఈఈఈ జేఎన్టీయూకే డాక్టర్ కె.వెంకటరెడ్డి, సీఎస్ఈ ఏఐ అండ్ ఎంఎల్ విభాగం వారి ఇ ఆర్టిఫ్యాక్ట్ 2025కు ప్రొఫెసర్ ఆఫ్ సీఎస్ఈ జేఎన్టీయూకే డాక్టర్ ఓ.శ్రీనివాసరావు, ఐటీ అండ్ సైబర్ సెక్యూరిటీ విభాగం వారి ఎమిట్రిక్స్ 2025కు ప్రొఫెసర్ సీఎస్ఈ జేఎన్టీయూకే డాక్టర్ ఎస్.సురేఖ ముఖ్యఅతిథులుగా విచ్చేశారని కళాశాల చైర్మన్ డాక్టర్ పరుచూరి కృష్ణారావు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వేగంగా అభివృద్ధి చెందుతున్న నూతన టెక్నాలజీని విద్యార్థులు నేర్చుకుంటూ సాంకేతిక నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి ఇటువంటి సాంకేతిక సదస్సులు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ మేనేజ్‌మెంట్ ఎంవి హరనాధబాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం.సతీష్, డైరెక్టర్ అకడమిక్స్ డాక్టర్ కె.సత్యనారాయణ, ప్రిన్సిపాల్ జి.నరేష్, ఏఐ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.రాధాకృష్ణ, డీన్ మాచిరాజు పాల్గొన్నారు.

నేడు ఉత్తరద్వార దర్శనం

గండేపల్లి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలో తాళ్ళూరు గ్రామంలో కోరిన కోర్కెలు తీర్చే వెంకటేశ్వరస్వామిగా శతాబ్దాల చరిత్ర ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తున్నట్లు ఆలయ ఈవో ఉనమట్ల రాజేష్, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ దాపర్తి సీతారామయ్య తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉద యం 4గంటల నుంచే ఉత్తరద్వార దర్శనం ఉంటుందన్నారు.

నవజాతి శిశు కేంద్రంలో శిశువుకు మెరుగైన వైద్యం



శిశువుతో డాక్టర్ ప్రజ్వల

కూనవరం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): పుట్టిన శిశువు కేవలం కేజీ బరువు ఉండడంతోపాటు అనారోగ్య సమస్యలు తలెత్తడంతో ఆ శిశువుకు మెరుగైన వైద్యం అందించి డాక్టర్ ప్రజ్వల పలువురి మన్ననలు పొందుతున్నారు. కూనవరం మండలం నర్సింగపేట గ్రామానికి చెందిన బొగ్గా అంజిత్, అనిత దంపతులకు నవం బరు 16న చింతూరు ఏరియా ఆసుపత్రిలో ఆడబిడ్డ జన్మించింది. ఆ బిడ్డ పుట్టినప్పుడు కేవలం కేజీ బరువు మాత్రమే ఉండడమే కాకుండా శిశువు అనారోగ్యంగా ఉంది. రోజులు పెరుగుతున్నా కొద్దీ శిశువు ఆరోగ్యం క్షీణిస్తుంది. దీంతో తల్లిదండ్రులు మండలంలోని కోతులగుట్ట ప్రభుత్వ వైద్యశాలలోని నవజాత శిశు కేం ద్రానికి తీసుకొచ్చారు. ఆ శిశువుకు వైద్యురాలు ప్రజ్వల 45రోజులపాటు వైద్యం అందించారు. శిశువు బరువు పెరిగే విధంగా చికిత్స చేశారు. బిడ్డ పూర్తిగా కోలుకుని ఆరోగ్యంగా ఉండడంతో గురువారం శిశువును డిశ్చార్జి చేశారు. వైద్యురాలు ప్రజ్వల గతంలో కూడా ఓ శిశువుకు సైతం ఇదే తరహా వైద్యం అంది ంచడం జరిగింది.

పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు

కూనవరం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): కరకగూడెం పంచాయతీ సెక్రటరీపై సచివాలయం సిబ్బంది కూనవరం ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఫిర్యాదు చేశారు. కార్యదర్శి సిబ్బందిపై అసభ్యకరంగా మాట్లాడుతున్నారని అంతేకాకుండా విధుల్లో సైతం ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. శాలరీ బిల్స్, ఇంక్రిమెంట్ బిల్స్ సరైన సమయంలో పెట్టకపోవడంతో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వెంటనే కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

జిల్లాలో 85శాతం గృహ నిర్మాణాలకు కృషి

● జిల్లా హౌసింగ్ పీడీ ఎన్‌వీవీ సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా గృహ నిర్మాణ సంస్థ పీడీ సత్యనారాయణ

ప్రత్తిపాడు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గృహనిర్మాణశాఖ ఆధ్వర్యంలో 68,651 గృహాలు మంజూరు కాగా 40253 గృహాలు నిర్మాణ దశలో ఉన్నాయని 28,396 గృహాలు పూర్తయ్యాయని, దాదాపుగా జిల్లాలో 85శాతం గృహ నిర్మాణ లక్ష్యాలు సాధించామని జిల్లా గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్‌వీవీ సత్యనారాయణ తెలిపారు. ప్రత్తిపాడు వెలుగు కార్యాలయంలో గురువారం నియోజకవర్గ గృహ నిర్మాణ సిబ్బంది సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న పీడీ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రత్తిపాడు నియోజకవర్గంలో 5752 గృహాలు మంజూరుగా 2047 నిర్మాణ దశలో ఉండగా 3705 పూర్తయ్యాయని తెలిపారు. నియోజకవర్గ గృహనిర్మాణ శాఖలో పని చేసే సిబ్బంది ధృడ సంకల్పంతో లక్ష్యాలు అధిగమించే విధంగా కృషి చేయాలన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గాన్ని గృహ నిర్మాణంలో ఉన్నత స్థానంలో ఉంచే విధంగా సిబ్బందిని అంకిత భావంతోపని చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ప్రత్తిపాడు, శంఖవరం, రౌతులపూడి ఎంపీడీవోలు ఎంవీఆర్ కుమార్ బాబు, ఎస్ఎస్ఎస్ శర్మ, జి.శ్రీరామ కృష్ణయ్య, హౌసింగ్ ఈఈ కేవీఆర్ గుప్తా, డిప్యూటీ ఈఈ ఎ.రత్నంబాబు, స్థానిక ఏపీవో కుమార్ స్వామి, ఏపీఎం వెంకట్‌లు, నియోజవర్గంలోని హౌసింగ్ ఏఈలు, సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఏపీవోలు, ఏపీఎం పాల్గొన్నారు.

సుబ్బారెడ్డి సాగర్ అధునికీకరణకు కృషి

● చైర్మన్ ఇళ్ళ అప్పారావు



సుబ్బారెడ్డి సాగర్‌వద్ద పూజలు నిర్వహిస్తున్న అప్పారావు

ప్రత్తిపాడు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సుబ్బారెడ్డిసాగర్ ప్రాజెక్టు అధునీకరణకు కృషి చేస్తామని ఆ ప్రాజెక్టు చైర్మన్ ఇళ్ళ అప్పారావు చెప్పారు. మండలంలోని సుబ్బారెడ్డిసాగర్ సాగునీటి సంఘాల అధ్యక్షులతో కలిసి చైర్మన్ ఇళ్ళ అప్పారావు గురువారం సుబ్బారెడ్డిసాగర్ ప్రాజెక్టును సందర్శించి ఇరిగేషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. చైర్మన్ అప్పారావు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ సహకారంతో సాగర్ కాలువల అభివృద్ధి, ప్రాజెక్టు ఆధునీకరణ వంటిపనులు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. సాగర్ ఆయకట్టు పరిధిలోని శివారు భూములకు సజావుగా సాగునీరు అందేవిధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం దాళ్వా అపరాల పంట సాగు నిమిత్తం సాగర్ ప్రాజెక్టు వద్దపూజలు నిర్వహించి నీరు విడుదల చేశారు. కార్యక్రమంలో ఇరిగేషన్ జేఈ ఇబ్రహీం, సర్పంచ్‌లు మంతెన వెంకటరమణ, వనపర్తి నాగేశ్వరరావు, సాగునీటి సంఘాల అధ్యక్షులు దోశే నూకరాజు, దెడ్డి సుబ్బారావు, చలంకూరి వెంకటేశ్వరరావు, దేవర రాజబాబు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి లొండా లోవరాజు, స్థానిక నాయకులు కుండల అప్పారావు, నిమ్మల రాంబాబు, అప్పారావు, జువ్విన తిరుపతిరావు, జి. రాజబాబు, ఇరిగేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రూ.10లక్షలు అందజేత



ఏలూరు గ్రామంలో బాధిత కుటుంబానికి రూ.10 లక్షలు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

ప్రత్తిపాడు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏలూరు గ్రామానికి చెందిన బాధిత కుటుంబానికి గురువారం సాయంత్రం స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రూ.10లక్షల చెక్కును అందజేశారు. ఏలూరుగ్రామానికి చెందిన జామి మహాలక్ష్మి ఏలేశ్వరం మండలం యర్రవరం గ్రామంలో అవంతి ప్రొసెస్‌ఫుడ్ కంపెనీలో కార్మికురాలిగా పనిచేస్తూ ఇటీవల జరిగిన ప్రమాదంలో మృతి చెందింది. దీంతో అవంతి కంపెనీ బాధితురాలికి రూ.10లక్షలు మంజూరుచేయడంతో దానికి సంబంధించిన రూ.10లక్షల చెక్కును ఎమ్మెల్యే సత్యప్రభ, ఆ గ్రామ సర్పంచ్ రొంగల సత్యనారాయణలు బాధిత కుటుంబాకి అందజేశారు. కార్యక్రమంలో ఏలేశ్వరం ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, మాజీ సర్పంచ్ జామిమాణిక్యం, టీడీపీ నాయకులు బసవప్రసాద్, జువ్విన తిరుపతిరావు, అడ్డాల త్రిమూర్తులు కొట్టేటి అబ్బులు పాల్గొన్నారు.

నేడు గిరి ప్రదక్షన

కోటనందూరు,జనవరి9(ఆంధ్రజ్యోతి): పాత కొట్టాంలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్నా వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉదయం 8.01 గంటలకు గిరిప్రదక్షన ప్రారంభమవుతుందన్నారు. ఈ గిరి ప్రదక్షన 5కిలోమీటర్లు ఉంటుందని భక్తులందరు గిరి ప్రదక్షనలో పాల్గొనాలని కమిటీ వారు తెలిపారు.

ఢిల్లీలో రిపబ్లిక్ డే వేడుకలకు పోలవరం సర్పంచ్



సర్పంచ్ సుభద్రమ్మ

తునిరూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): జనవరి 26న న్యూఢిల్లీలో జరుగు గణతంత్ర దినోత్సవ వేడుకలకు డి.పోలవరం గ్రామ సర్పంచ్ సి.సుభద్రయమ్మ హాజరుకానున్నట్లు ఎంపీడీవో సాయినవీన్ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆమెకు ఆహ్వాన లేఖ పంచాయతీ రాజ్ కమిషనర్ నుంచి అందినట్లు తెలిపారు. అరుదైన గుర్తింపు లభించడం పట్ల డి.పోలవరం సర్పంచ్ సుభద్రమ్మను గ్రామపెద్దలతో పాటు పలువురు కూటమి పార్టీ నాయకులు అధికారులు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జగ్గంపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రాజపూడి 33కేవీ ఫీడర్‌లో చెట్లు నరికివేత, మరమ్మతులు, లైన్ ఏబీ స్విచ్ కరెక్షన్ కారణంగా శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఈఈ వీరభద్రరావు తెలిపారు. రాజపూడి, కొత్తూరు, మల్లిశాల, వెంగయమ్మాపురం, గోవిందపురం, కృష్ణాపురం, సీతారామపురం, జగ్గంపేట, బాలాజీ రైసుమిల్లు ప్రాంతాల్లో విద్యుత్‌సరఫరా ఉండదని తెలిపా రు.

తాటాకిల్లు దగ్ధం

శంఖవరం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో గొంది కొత్తపల్లి గ్రామంలో గురువారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో అడ్డాల నూకరాజుకి చెందిన ఇల్లు అగ్నికి ఆహుతైంది. ఒక్కసారిగా మంటలు చేలరేగడంతో అదుపుచేసే లోపే మంటలు చెలరేగి ఇల్లు అగ్నికి ఆహుతైందని బాధితుడు వాపోయాడు. గ్రామస్తులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినా ప్రయోజనం లేకపోయింది. వీఆర్‌వో సింహాచలం పరిశీలించి సుమారు రూ.50వేల వరకూ ఆస్థినష్టం ఉంటుందని అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని తెలిపారు.

అధికారం శాశ్వతం కాదు

●సీఎం చంద్రబాబుకు లేఖ రాసిన ముద్రగడ

కిర్లంపూడి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): అధికారం శాశ్వతం కాదని అమావాస్య తర్వాత పౌర్ణమి, పౌర్ణమి తర్వాత అమావాస్య వస్తాయని మాజీ మంత్రి, వైసీపీ నేత ముద్రగడ పద్మనాభరెడ్డి గురువారం సీఎం చంద్రబాబుకు లేఖరాసి మీడియాకు విడుదల చేశారు. 1999లో మీ ఆహ్వానం మేరకు మీ పార్టీలోకి వచ్చానని, సుమారు ఐదు సంవత్సరాలు పార్టీలో కొనసాగానని ఎప్పుడూ రెడ్‌బుక్ గురించి, ఎవరిని వేధించడం, పోలీసులతో కేసులు బనాయించడం ఆటైంలో మీ పాలనలో ఎప్పుడూ చూడలేదన్నారు. ఈ రాష్ట్రం ఎవరి జాగీరు, ఎవరి ఎస్టేటు కాదన్నారు. ఎవరైనా ప్రజల దయతో పాలన చేయాల్సిందేనన్నారు. ఈ రోజు గెలిచిన మీరు మీ కుమారులు రెడ్‌బుక్ పేరుతో ప్రతీ నిమిషం కేసులు పెట్టించే కార్యక్రమం తీసుకోవడం చాలా బాధగా ఉందన్నారు. ఎందుకు ఈరకమైన పాలన చేస్తున్నామో ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు.

రేపు ధర్మవరంలో రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలు

ప్రత్తిపాడు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో ఈనెల 11న రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్థానిక గౌరీశంకర్ల 88వ వార్షికోత్సవ మహోత్సవం సందర్భంగా నిర్వహించే పోటీలను ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ప్రారంభించనున్నారు. సీనియర్స్ విభాగంలో ప్రథమ బహుమతికి రూ.15వేలు, ద్వితీయ బహుమతి రూ.10వేలు, తృతీయ బహుమతి రూ.8వేలు అందజేయనున్నట్లు తెలిపారు.

మందుల వాడకంలో జాగ్రత్తలు తప్పనిసరి

శంఖవరం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కలుపు మందుల వాడకంలో రైతులు జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయాధికారి పి.గాంధీ సూచించారు. కత్తిపూడిలో వెదజల్లిన పంటను పరిశీలించి రైతులతో మాట్లాడారు. వెదజల్లిన 20రోజుల తరువాత కలుపు నివారణ కోసం నిహాలోపాప్ బుటైల్ నీటిలోకలిపి పిచికారీ చేయాలని తెలిపారు.

రూ.10 లక్షల సీసీ రోడ్లకు శంకుస్థాపన

ఎటపాక, జనవరి 9(ఆంధ్రజ్యోతి)! మండలంలోని గన్నవరం గ్రామంలో గురువారం రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. గన్నవరంలోని వీధిలో రూ.10లక్షల వ్యయంతో సీసీ రహదారి నిర్మాణం చేపట్టనున్నారు. ఎంపీటీసీ నిధులతో ఈ రహదారి మంజూరైంది. పంచాయతీరాజ్ ఏఈ ఎస్, ఎర్రయ్య, సర్పంచ్ గడ్డం భద్రమ్మ, ఎంపీటీసీ కంటేరాజు రహదారి పనులకు శంకుస్థాపన చేశారు.